

కొత్త కలెక్టర్‌కు.. సవాళ్ల స్వాగతం!



- నేడు బాధ్యతలు స్వీకరించనున్న కృతికా శుక్లా
- ఉమ్మడి గుంటూరు జేసీగా జిల్లాపై అవగాహన
- రెవెన్యూ అవకతవకలే ప్రధాన సమస్య..

జిల్లా నూతన కలెక్టర్‌గా కృతికా శుక్లా శనివారం బాధ్యతలు చేపట్టనున్నట్టు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా జేసీగా ఆమె బాధ్యతలు నిర్వహించిన విషయం తెలిసిందే. నూతన కలెక్టర్‌కు జిల్లాలో సవాళ్లు స్వాగతం పలకనున్నాయి. పల్నాడు జిల్లా ఏర్పడి మూడేళ్ల ఐదు మాసాలు గడిచినా ఇంకా ప్రగతి బాట పట్టలేదు. ప్రధానంగా ప్రకృతి వనరుల దోపిడీపై కఠిన చర్యలకు ఉపక్రమించాల్సి ఉంది. పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగ, ఉపాధి కల్పనపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కీలక ప్రాజెక్టులు నిలిచిపోయాయి. ఇక్కడ వనరులు, పరిపాలన, పరిస్థితులుపై అవగాహన ఉన్న కృతికా శుక్లా ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని సవాళ్లను అధిగమించడంతో పాటు జిల్లా ప్రగతిపై తనదైన ముద్ర వేయాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ రికార్డులను ఇష్టానుసారం మార్చడం, ప్రభుత్వ భూములకు హక్కులు కల్పించడం వంటి అక్రమాలు చోటు చేసు కున్నాయి. గురజాల మండలంలో పెద్దఎత్తున ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నారు. వందలాది ఎకరాలు కబ్జా చేశారు. గురజాల మండల పరిధిలో 150 మంది ఆక్రమణదారులను గుర్తించారు. ప్రభుత్వ భూములు కాజేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ శాఖ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. రీ-సర్వే సమస్యలు రైతులను వెంటాడుతున్నాయి. భూముల సమస్యల కోసం రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి ప్రదక్షిణలు చేస్తున్నారు.

పారిశ్రామిక వృద్ధిలో వెనకడుగు

పల్నాడులో పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించడం లేదు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తేనే ఉపాధి ఉద్యోగాలు లభించే అవకాశం ఉంటుంది. ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు మొక్కుబడిగానే సాగుతోంది. ప్రతి నియోజక వర్గంలో ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం (మిగతా 6వ పేజీలో)

కానరాని అభివృద్ధి..

జిల్లా 7.54 గ్రోత్ రేటుతో రాష్ట్రంలో 24వ స్థానంలో నిలిచింది. జిల్లా తలసరి ఆదాయం రూ.1,86,937 నుంచి రూ.2,16,504 పెరిగేలా లక్ష్యాన్ని ప్రభుత్వ నిర్దేశించింది. ఇందుకు తగిన కసరత్తు కానరావడం లేదు. రానున్న నాలుగేళ్లలో రూ.5.43 లక్షలకు తలసరి ఆదాయం పెరగాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానంగా ఉద్యానవన పంటల ద్వారానే అధిక ఆదాయం వస్తుందని అంచనాగా ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీడీవీఏ రూ.49,105 కోట్లు, జీడీడీపీని రూ.53,488కు పెంచే దిశగా లక్ష్యాలను నిర్దేశించారు.



పొందుగల బీడు పొలాలను సర్వే చేస్తున్న తహసీల్దార్ (పాత చిత్రం)

మూడు వందల ఎకరాల అన్యాక్రాంతం

- ఆక్రమిత భూములపై బ్యాంకుల్లో రుణాలు
- అధికారుల విచారణలో వెలుగుచూస్తోన్న భూ అక్రమాలు

దాచేపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ తీర ప్రాంత గ్రామాల్లో ప్రభుత్వ భూములను సొంత భూములుగా, పూర్వార్జిత భూములుగా, కొనుగోలు చేసినట్లుగా వైసీపీ నేతలు మూడు వందల ఎకరాలకుపైగా అన్యాక్రాంతం చేసినట్లు సమాచారం. వైసీపీ హయాంలో జరిగిన భూ అక్రమాలపై గత కొన్ని రోజులుగా రెవెన్యూ అధికారులు విచారణ జరుపుతున్నారు. ఈ క్రమంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను చూసి అధికారులే విస్తుపోతున్నారు. పొందుగలలో 170.25 ఎకరాలు, తంగెడలో 137.6 ఎకరాలు అన్యాక్రాంతమైనట్టు అధికారులు గుర్తించారు. పొందుగులలో 57 మంది, తంగెడలో 62 మంది తమ పేర్లను వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయించుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఆ రెండు గ్రామాల్లో భూములు ఎక్కించుకున్న 121 మంది రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వ భూములను ఎలా ఆన్‌లైన్ చేయించుకుంటారు? మీ వద్ద ఉన్న అధారాలతో తహసీల్దార్ కార్యాలయానికి రావాల్సిందిగా అధికారులు ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేసిన వ్యక్తుల రుణాలను తిరిగి రెన్యువల్ చేయవద్దని అధికారులు బ్యాంకులను కోరారు. దాచేపల్లిలోని ఎస్‌బీఐ, చైతన్య గోదావరి, కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులకు ఇందుకు సంబంధించి నోటీసులు కూడా అందజేశారు. భూ అక్రమాలకు బాధ్యులైన వారిని గుర్తించిన విచారణ అధికారులు కలెక్టర్‌కు నివేదిక అందజేసినట్లు సమాచారం. ఈ రెండు గ్రామాలే కాకుండా దాచేపల్లిలోని మిగతా గ్రామాల్లో కూడా రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు. అవకతవకలు ఏమైనా జరిగాయి? వంటి పూర్వాపరాలను సేకరిస్తున్నారు.

మలుపులు..ప్రమాదానికి పిలుపులు

- కానరాని హెచ్చరిక బోర్డులు
- వాహనదారులకు తప్పని ప్రమాదాలు



పరస నుంచి కంభంపాడు వెళ్లే రోడ్డులో మూల మలుపు



యూరియా దిగుమతిని పరిశీలిస్తున్న జేడీ జగ్గారావు

2270 టన్నుల యూరియా దిగుమతి

- ఇప్పటికే జిల్లాలో 3 వేల టన్నుల నిల్వలు

నరసరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు యూరియా సరఫరా గణనీయంగా పెరిగింది. 2,270 టన్నుల యూరియా శనివారం దిగుమతి కానున్నది. ఇప్పటికే జిల్లాలో 3,000 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయని వ్యవసాయశాఖ జేడీ జగ్గారావు శుక్రవారం తెలిపారు. మొత్తంగా 5,270 టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా విక్రయాలు జరుగుతున్నాయని చెప్పారు. యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పంటకు ఏ దశలో ఎంత యూరియా అవసరమో అంతే కొనుగోలు చేయాలని రైతులకు జేడీ సూచించారు. పంట పూర్తికాలం మొత్తానికి అవసరమైన యూరియాను ముందే కొనుగోలు చేయవద్దన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా యూరియా విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. యూరియా విక్రయాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ పుల్లారావు

నాదెండ్ల, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాతో పాటు విక్రయిస్తున్న ఇద్దర్ని అరెస్టు చేసి వారి నుంచి ఏడు వందల గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నాదెండ్ల పోలీసు స్టేషన్‌లో శుక్రవారం మీడియా ఎదుట హాజరుపరిచి వారి వివరాలను చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బ నాయుడు, ఎస్ఐ పుల్లారావు ప్రకటించారు. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ఉత్తమ్‌మాలిక్, బులు బెహరాలు గణపవరం గ్రామ పరిధిలోని కార్మికులుగా పని చేస్తూ క్వార్టర్స్‌లో నివసిస్తున్నారు. వీరిద్దరూ గంజాయి తెచ్చి తాగడంతో పాటు గ్రామంలోని స్పిన్నింగ్ మిల్లులతో పాటు పరిసర ప్రాంత వాసులకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో నిఘా పెట్టిన పోలీసులకు గురువారం వారు బైపాస్ సమీపంలో గంజాయి అమ్ముతుండగా అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. అనంతరం వారిని కోర్టుకు హాజరు పరిచారు.

పత్తి సాగు పెరిగింది

- గతేడాది కంటే 39,477 ఎకరాలు అధికం
- మిర్చి ప్రత్యామ్నాయంగా రైతుల మొగ్గు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
ఏటేటా తగ్గుతూ వచ్చిన పత్తి సాగు ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. మిరపకు ప్రత్యామ్నాయంగా రైతులు పత్తి సాగుకు మొగ్గు చూపారు. గతేడాది కంటే 39,477 ఎకరాల్లో పత్తి సాగు పెరిగిందని వ్యవసాయ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో కర్నూలు జిల్లా తర్వాత అత్యధికంగా పత్తి సాగు అయ్యే జిల్లా పల్నాడు. వర్షాలు సమృద్ధిగా కురవడం, సాగర్ కాలువలకు పుష్కలంగా నీటి సరఫరా జరుగుతున్న నేపథ్యంలో రైతులు పత్తి సాగు చేపట్టారు. జిల్లా పత్తి సాధారణ విస్తీర్ణం 2,28,915 ఎకరాలు. ప్రస్తుతం 1,88,287 ఎకరాల్లో పత్తి సాగైంది. సాధారణ విస్తీర్ణంలో ఇది 80 శాతం. గత ఏడాది 1,43,810 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ ఏడాది 39,477 ఎకరాల పత్తి సాగు పెరగడం గమనార్హం. 2023 ఖరీఫ్‌లో 1,53,522 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. 2023, 2024 ఖరీఫ్ సీజన్‌లలోతగ్గిన పత్తిసాగు ఈ ఖరీఫ్‌లో పుంజుకుంది. పత్తి సాగు పెరగడంతో సదరు పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల ఉపాధి మెరుగుకానుంది. పత్తి సాగు పెరుగుదల సంబంధిత పరిశ్రమలకు మేలు జరగ నుంది.

చెరువులకు జలకళ

- పీఎం కృషిలో అభివృద్ధి పనులు
- నీటికి దోకా లేదని వరిసాగులో రైతులు



నిండుకుండలా కంచర్ల చెరువు



నాట్లు వేస్తున్న రైతులు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పీఎం కృషి సంచార యోజనతో చెరువులకు మహర్దశ పట్టింది. వినుకొండ నియోజకవర్గంలోని 28 చెరువులకు మరమ్మతులు చేపట్టారు. ఇదే సమయంలో పుష్కలంగా వర్షాలతో చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. నాగార్జున సాగర్ జలాశయం ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో కాల్వల ద్వారా నీటిని అధికారులు విడుదల చేశారు. దీంతో నియోజకవర్గంలోని 90 చెరువులు ఇప్పటికే నిండుకుండలను తలపిస్తున్నాయి. చెరువుల కింద పంటలను పండించేందుకు రైతులు సిద్ధయ్యారు. మండలంలోని పెదకంచర్ల, రావిచెట్టు పాలెం, జంగాలపల్లి, పెరుమాళ్లపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు చెరువునీటి సాయంతో వరి సాగు చేపట్టారు. రైతులు పొలం పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. సాగునీటి ఇబ్బందులు ఉండవని పలువురు రైతులు వందల ఎకరాల్లో వరి సాగుకు సమాయత్తమయ్యారు. పొలాలను దమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు ఇప్పటికే నాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. దీంతో పంట పొలాలు పచ్చగా కళకళలాడుతున్నాయి. 70 చెరువులపై ఆధారపడి వినుకొండ నియోజకవర్గంలో సుమారు 5 వేల ఎకరాలకుపైగా రైతులు పంటలు పండిస్తున్నారు. ప్రధానంగా పెదకంచర్ల చెరువు కింద 1048 ఎకరాలు, దొండపాడు 1698, నడిగడ్డ 108, ఈపూరు 215, బొగ్గరం 255, రాముడుపాలెం 360, ముక్కెళ్లపాడు 262, గోకనకొండ 165, కనమర్లపూడి 294, పెద్దకండలేరు ట్యాంక్(పలుకూరు ట్యాంక్) తదితర చెరువుల కింద వరి పండిస్తున్నట్లు ఇరిగేషన్ అధికారి కోటేశ్వరరావు తెలిపారు.

డైట్‌లో ముగిసిన కళా ఉత్సవాలు

- 12 విభాగాల్లో పోటీ.. 200 మంది హాజరు
- నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యమన్న డీఈవో



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

యడ్లపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోయపాలెంలోని డైట్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి కళాఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉత్సవాల్లో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 12 విభాగాల్లో కళాఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకళ మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో మొదటి స్థానం సాధించిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో గుంటూరు డీఈవో రేణుక, నోడల్ డాక్టర్ విమలకుమారి, రాష్ట్ర పరిశీలకులు కల్పన, డైట్ లెక్చరర్లు మహబూబ్ సుభాని, వై శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

క్వారీల్లో విజిలెన్స్ తనిఖీలు

వంకాయలపాడు, గురవాయపాలెంలో ఎక్సకవేటర్ల సీజ్

యడ్లపాడు, నరసరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు, నరసరావుపేట మండలాల పరిధిలోని అక్రమ మైనింగ్‌పై అధికారులు శుక్రవారం దాడులు చేశారు. అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్, మైనింగ్ అధికారులు శుక్రవారం క్వారీల్లో తనిఖీలు చేశారు. యడ్లపాడు మండలం వంకాయలపాడు పరిధిలోని కొండ క్వారీలో జరుగుతున్న తవ్వకాలను అడ్డుకున్నారు. అనుమతులు తీసుకోకుండా వంకాయలపాడు పరిధిలోని సర్వే నెం.333 కొండ క్వారీలో మెటల్



విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన ఎక్సకవేటర్

క్వారీయింగ్ చేసి క్రషర్లకు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. క్వారీ వద్ద లారీలకు లోడింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న ఎక్సకవేటర్‌ను సీజ్ చేసి స్థానిక వీఆర్వోకు అప్పగించారు. మైనింగ్ ఏడీ నాగిని మాట్లాడుతూ వంకాయలపాడు కొండ క్వారీలో అక్రమ మైనింగ్ జరుగుతున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. మైనింగ్ సిబ్బంది క్వారీ వద్దకు రావడాన్ని గమనించి యంత్రాన్ని వదిలేసి డ్రైవర్లు పారిపోయారన్నారు. అశోక్ అనే వ్యక్తి అక్రమ క్వారీయింగ్ నిర్వహిస్తున్నట్లు తెలియవచ్చిందని, యంత్రం కూడా అతడిదేనని గుర్తించామన్నారు. దాడుల్లో మైనింగ్ టీఏ కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

కోటప్పకొండలో..

కోటప్పకొండ ప్రాంతంలోని గురవాయపాలెం వద్ద అక్రమ మైనింగ్ జరుగుతుందన్న సమాచారంతో రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి డీ సూర్యశ్రవణ్ ఆదేశాలతో అధికారులు దాడులు చేసి తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ మట్టి తవ్వకాలకు వినియోగిస్తున్న ఎక్సకవేటర్‌ను సీజ్ చేశారు.

30 యూరియా బస్తాలు స్వాధీనం

- మాచర్లలో ఆటో సీజ్.. డ్రైవర్ అరెస్టు

విజయపురిసౌత్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నుంచి అక్రమంగా తరలిస్తున్న 30 యూరియా బస్తాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ తెలిపారు. ఏకోనాంపేట వైపు యూరియా అక్రమంగా తరలివెళ్తుందన్న సమాచారంతో తనిఖీలు చేసి ఆటోను సీజ్ చేశామన్నారు. డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. తనిఖీలో ఏవో పాపకుమారి, రాంబాబు, ఏఈవోలు మార్కండేయులు, చౌదరిరెడ్డి, వీఆర్వో రవికుమార్, వీపీఏలు జాస్మి, అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.



యూరియా బస్తాలతో ఉన్న ఆటోను స్వాధీనం చేసుకున్న పోలీసులు

భౌ..భౌలతో భయం

వీధుల్లో శునకాల స్వైరవిహారం
రోడ్డుపైకి రావాలంటే వణికిపోతోన్న జనం



జాలకల్లు వీధుల్లో శునకాలు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సందుగొందులతో పాటు ప్రధాన మార్గాల్లో ఎక్కడ చూసినా కుక్కలు మందలు మందలుగా సంచరిస్తున్నాయి. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా కనిపించిన వారిపై ఎగబడి దాడి చేస్తున్నాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ఎటువైపు నుంచి వచ్చి దాడి చేస్తాయో తెలియక ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఇళ్లలో నుంచి బయటకు రావాల్సి వస్తోంది. గుంపులు గుంపులుగా సంచిరిస్తున్న శునకాలు రోడ్డుపైకి వచ్చిన వారిపై దాడి చేసి పీక్కలు పీకుతున్నాయి. చేతిలో కర్ర లేకుండా జనం ఇళ్ల నుంచి బయటకు రావడంలేదంటే కుక్కలంటే భయం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. మండల కేంద్రం సహా గ్రామాల్లో కూడా శునకాల స్వైరవిహారంతో ప్రజలు, చిన్నారులు బెంబేలెత్తిపోతున్నారు. ఒకటి.. రెండు కాదు.. పదుల సంఖ్యలో గ్రామసింహాలు వీధుల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. పిడుగురాళ్ల, మాచవరమే కాదు.. ప్రతిచోట కొద్ది రోజులుగా మహిళలు, వృద్ధులను వదలకుండా కుక్కలు దాడి చేస్తున్నాయి. దీంతో పాఠశాలలకు వెళ్లే చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. తోడు లేనిదే మహిళలు, విద్యార్థులు రోడ్డెక్కలేకపోతున్నారు. పిడుగురాళ్ల పట్టణంలోనే ప్రైవేటు వైద్యశాలలో రోజుకు ఐదుగురికి పైగా కుక్కకాటు బాధితుల ఓపిలు నమోదవుతున్నాయి. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో కూడా పెద్దసంఖ్యలో కుక్కల దాడి బాధితులు చికిత్స పొందుతున్నారు. కుక్కకాటు వైద్యం ఖరీదైనది కావడంతో పేదలు ప్రభుత్వ వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు.



పశువులను ఢీకొన్న రాయగడ ఎక్స్‌ప్రెస్

● మార్గ మధ్యలో నిలిపేసిన ఫలక్‌నుమా రైలు

గుంటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం వేకువజామున పశువులను ఢీ కొని మొరాయించింది. మంగళగిరి - నంబూరు సెక్షన్‌లో ఈ ఘటన జరిగింది. దీంతో లోకో స్వల్పంగా మరమ్మతులకు గురికాగా అధికారులు తాత్కాలిక రిపేర్లు నిర్వహించి పంపించారు. సుమారు గంట పాటు రైలు నిలిచిపోయింది. హౌరా నుంచి వస్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌ని 50 నిమిషాల పాటు మంగళగిరి వద్ద నిలిపేయాల్సి వచ్చింది.

కొనసాగుతున్న ఉపాధ్యాయుల నిరసన

● తహసీల్దారు కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేత



పశ్చిమ తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు (విద్య) సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యా యులకు, ఉద్యో గులకు చెల్లించాల్సిన బకా యిల విడుదల కోరుతూ ఏపీటీఎఫ్ తలపెట్టిన నిరస న కొనసాగుతోంది. శుక్రవా రం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తహసీల్దారు కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శన చేసి తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా ఏపీటీఎఫ్ సంఘంతో చర్చలు జరిపి పెండింగ్ ఆర్థిక బకాయిలు విడుదల పై రోడ్ మ్యాప్ షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా శాఖ కార్యదర్శి సత్యనారాయణమూర్తి, పి.శివరామకృష్ణ, మునినాయిక్, చంద్రశేఖర్, అంకారావు,వేణుగోపాలరావు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ప్రాంగణ ఎంపికలు



ప్రతిభ నిర్ధారణ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

ఏఎన్‌యూ సెప్టెంబర్, 12(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యా లయంలోని ఎమ్మెస్సీ (బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ)విద్యార్థులకు శుక్రవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఇంజనీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌లో డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీ సంస్థ నిర్వాహకులు ఆన్‌లైన్ ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఇంజనీరింగ్, సైన్స్ కళాశాలల ప్రాంగణ నియామకాల అధికారులు డాక్టర్ తౌసిఫ్ అహమ్మద్, డాక్టర్ సూర్య కామేశ్వరి విద్యార్థులను సమన్వయపరిచారు. డాక్టర్ రెడ్డీస్ హెచ్‌ఆర్ వైష్ణవి, గ్రేస్ ఆమోర్ నిర్వహించిన ఇంటర్వ్యూకు 62 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంపిక చేసిన విద్యార్థులకు ఈ నెల 16, 17 తేదీల్లో ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు.

దమ్ముంటే చర్చకు రా.. పిన్నెల్లి!

● నీ తండ్రి ఎరువుల కుంభకోణంపై చర్చకు సిద్ధమా..?

● త్వరలో వరికపూడిశెల నిర్మాణానికి శంకుస్థాపన

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దమ్ముంటే చర్చకు రావాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం పట్టణంలోని కేసీపీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎరువుల కొరత ఉందని కృత్రిమ పోరాటం చేస్తూ వైసీపీ రైతులను తప్పుదోవ పట్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని సొసైటీలు, మార్కెట్ యార్డు, మార్క్‌ఫెడ్, గ్రోమోరు సెంటర్లలో వందల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మించకుంటే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న పిన్నెల్లి నేడు రైతుల కోసం మొసలి కన్నీరు కార్చడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని సమర్థంగా అమలు చేసి రైతు బాంధవునిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలిచారని తెలిపారు.

ఎరువుల కుంభకోణంపై చర్చకు సిద్ధమా..?

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకొని పిన్నెల్లి తండ్రి వెంకటేశ్వరరెడ్డి, పిన్నెల్లి హనిమిరెడ్డి పాల్పడ్డ ఎరువుల కుంభకోణం, యూరియా కుంభకోణంపై చర్చకు సిద్ధమా అంటూ ఎమ్మెల్యే జూలకంటి నిలదీశారు. వేల మెట్రిక్ టన్నుల యూరియా ఎరువులు బ్లాక్ మార్కెట్ మార్కెట్‌లో అమ్ముకున్న లెక్కలు అవినీతి పై త్వరలో ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో రైతులను అన్ని విధాలుగా నాశనం చేసి ఇప్పుడు కృత్రిమ పోరాటాలు చేస్తున్నారని ఆరోపించారు. మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలంలో వరికపూడిశెల ప్రాజెక్ట్ లిఫ్ట్ నిర్మాణ పనులకు వచ్చే అసెంబ్లీ సమావేశాలు అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందని, శంకుస్థాపన తేదీని కూడా ప్రకటిస్తామని ఎమ్మెల్యే జూలకంటి ఈ సందర్భంగా తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ఆశయ సాధన కోసం తీవ్రంగా శ్రమించిన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్‌యార్డు చైర్ పర్సన్ మల్లీశ్వరి మధుసూదన్ యాదవ్, వైస్ చైర్మన్ గుండాల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మద్దిగపు చిన వెంకట్రామిరెడ్డి, కృష్ణవేణి, మంజుల పెద్ద అంజి, గోగుల వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎడ్ సెట్, లా సెట్ ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ఏఎన్‌యూ, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఎడ్ సెట్-2025), లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీ లా సెట్-2025)కు దరఖాస్తు చేసుకున్న ప్రత్యేక కేటగిరి అభ్యర్థులకు ఏఎన్‌యూలోని ఆన్‌లైన్ కౌన్సిలింగ్ కేంద్రంలో శుక్రవారం విద్యార్హత సర్టిఫికెట్లు పరిశీలన చేసినట్లు కేంద్రం సమన్వయకర్త ఆచార్య పి.బ్రహ్మజీరావు, ఎడ్ సెట్ కన్వీనర్ ఆచార్య స్వామి, లా సెట్ కన్వీనర్ ఆచార్య సీతాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎడ్ సెట్‌కు సంబంధించి ఎన్‌సీసీ కేటగిరి నుంచి 27, క్యాప్ నుంచి ఐదుగురు, క్రీడల నుంచి ఐదుగురు, లా సెట్‌కు ఎన్‌సీసీ నుంచి 158, క్యాప్ నుంచి 10, క్రీడల నుంచి 34 మంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ కేటగిరి నుంచి ముగ్గురు అభ్యర్థులు హాజరయ్యారని చెప్పారు. పీహెచ్ కేటగిరి అభ్యర్థులకు తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

విశ్రాంత ఉద్యోగికి నగదు వితరణ

ఏఎన్‌యూ స్వర్ణోత్సవాల సందర్భంగా వర్సిటీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ఒగ్గు నాగేశ్వరరావుకు రూ. 50 వేల చెక్కును వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్న షీలామణి అందజేశారు. నాగేశ్వరరావు ప్రస్తుతం పెన్షనర్ల సంఘం కోశాధికారిగా ఉన్నారు. పెన్షనర్ల సంఘం, సహచర ఉద్యోగులు వితరణ పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాగేశ్వరరావుకు నగదు చెక్కు అందజేస్తున్న వీసీ, రెక్టార్

పీజీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదల

వర్సిటీ పరిధిలో జూలైలో జరిగిన పీజీ కోర్సుల రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు శుక్రవారం విడుదల చేశారు. ఎంఎస్సీ బయోటెక్నాలజీలో నూరుశాతం, సాయిల్ సైన్స్ అండ్ అగ్రి కల్చరల్ కెమిస్ట్రీలో 12, సైకాలజీలో 21, ఫోరెన్సిక్ సైన్సెస్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. రీవాల్యూయేషన్‌కు ఈ నెల 22లోగా పేపరుకు రూ.1,860 చెల్లించి పరీక్షల కోఆర్డినేటర్‌కు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పరీక్ష ఫలితాలు ఏఎన్‌యూ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అమరావతిలో పర్యావరణ, సామాజిక రక్షణపై సంతృప్తి

● ముగిసిన వరల్డ్ బ్యాంకు, ఏడీబీ బృందం పర్యటన



బృంద సభ్యులకు అమరావతిలో తీసుకుంటున్న రక్షణ చర్యలను వివరిస్తున్న గుత్తేదారు సంస్థల ప్రతినిధులు

తుళ్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో పర్యావరణ, సామాజిక రక్షణ కార్యకలాపాలపై వరల్డ్ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకుల బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. రెండు రోజుల పాటు ఈ బృందం అమరావతిలో చేపట్టిన పర్యటన శుక్రవారంతో ముగిసింది. అమరావతిలో నిర్మాణ పనులు చేపట్టిన ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీల ప్రతినిధులు తమ క్యాంపు సైట్‌లలో అమలు చేస్తున్న పర్యావరణ, సామాజిక రక్షణ కార్యకలాపాలను, కార్మికుల భద్రత విధానాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమం తుళ్లూరులోని హెఎస్‌ఆర్ కల్యాణ వేదికలో జరిగింది. ఈ సందర్భంగా బృందం పలు సూచనలు చేసింది. అమరావతిలో లింగ వివక్షకు, బాల కార్మికులకు తావులేకుండా.. సీఆర్డీఏ అధికారుల సూచనల మేరకు నిర్మాణ పనులు చేపట్టినట్లు గుత్తేదారు సంస్థల ప్రతినిధులు వివరించారు. తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులో విజయవంతంగా అమలు చేసిన భూ సమీకరణ విధానం(ల్యాండు పూలింగ్), అలాగే నెగోషియేటెడ్ సెటిల్ మెంట్ పాలసీ భూ సేకరణ(ఎల్‌పీ)విధానాల గురించి.. సీఆర్డీఏ అధికారులు బృందానికి వివరించారు. రాజధాని అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా నిర్వహించిన సోషల్ ఆడిట్ ప్రక్రియ, సిటిజన్ అడ్వైజరీ గ్రూప్ నుంచి వచ్చిన సలహాలను వివరించారు. రాజధాని రైతులు, రైతు కూలీల సమస్యలను పరిష్కరించేందుకు అర్జీలు స్వీకరించి ఆయా అర్జీల పరిష్కారానికి సమగ్రంగా ఏర్పాటు చేసిన గ్రివెన్స్ రిడ్రెస్సల్ మెకానిజం గురించి తెలియజేయగా.. బృందం సంతృప్తి వ్యక్తం చేసింది.

నిధి భవన్‌లో కాంట్రాక్టర్ల నిరసన



నిధి భవన్‌లో బైఠాయించిన కాంట్రాక్టర్లు

మంగళగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరి ఆటోనగర్‌లోని నిధి భవన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 200 మంది కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. అనంతరం సమస్యలపై నిధి భవన్ సీఈవో గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. విజయ్‌కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పది రోజుల వరకు మాత్రమే బిల్లులు పోర్టల్‌మో నమోదు చేస్తారనే అపోహలో ఉన్నారని, అది నిజం కాదన్నారు. 30 రోజుల వరకు పోర్టల్స్‌లో బిల్లులు నమోదు చేస్తామని అధికారులు చెప్పారని, ఈ విషయాన్ని కాంట్రాక్టర్లందరూ గమనించాలని సూచించారు. నిధి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలను సరిచేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో బిల్లులు రాక దాదాపు 40 మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా పరిస్థితిలో మార్పు రాలేదని తెలిపారు. మునిసిపాలిటీలు, కార్పొరేషన్లను సీఎఫ్ఎంఎస్ నుంచి డీలింక్ చేసి నిధి పోర్టల్‌లో ఉంచడంతో కాంట్రాక్టర్ల కష్టాలు రెట్టింపు అయ్యాయని చెప్పారు. మునిసిపాలిటీల్లో అధికారులు పీవో విధానం పాటించకుండా బిల్లులు అప్‌లోడ్ చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సహాయ కార్యదర్శి కొండా రమేష్, కోశాధికారి అప్పారావు, వివిధ జిల్లాల అధ్యక్షులు కే.వెంకట్రావు, మండవ సాయి, రాంబాబు, శాంతారావు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559


బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 145, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ

ఏపీ అధ్యక్షుడిగా భగవన్నారాయణ



దేవతి భగవన్నారాయణ

మంగళగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఏపీ అధ్యక్షుడిగా మంగళగిరికి చెందిన దేవతి భగవన్నారాయణ నిమితులయ్యారు. ఈ మేరకు మద్రాసులోని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ముఖ్య కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో దేవతి భగవన్నారాయణను నియమిస్తూ ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ నియామక పత్రాన్ని అందజేశారు. మహాసభ కన్వీనర్ యెల్లూరు లక్ష్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సుధాకర్ తదితరులు భగవన్నారాయణకు అభినందనలు తెలిపారు. భగవన్నారాయణ నియామకం పట్ల మంగళగిరికి చెందిన పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

31,890 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 31,890 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 36,734 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,208 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12500
334	10000	14500	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13500	334	10500	14400
273	10500	13500	నెంబరు. 5	10000	13600
341	10000	15000	273	---	---
4884	----	---	341	11000	15600
సూపర్ 10	---	---	4884	10000	14200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	16200
బ్యాడిగి	10000	16000	దేవనూరు డీలక్స్	10500	14500
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7700

తండ్రికి తీసిపోని లోకేశ్ పనితీరు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): నేపాల్ హింసాకాండలో చిక్కుకున్న తెలుగువారిని కాపాడటంలో యువ నేత, మంత్రి నారా లోకేశ్ చూపిన చొరవ, ముందు చూపుతో ఆయన వ్యవహరించిన తీరు నిజమైన నాయకత్వ లక్షణానికి ప్రతీక అని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు ఉత్తరాఖండ్‌లో చిక్కుకున్న తెలుగువారిని రాష్ట్రానికి తరలించే వరకు అవిశ్రాంతంగా పనిచేశారని గుర్తుచేశారు. చంద్రబాబు మార్గదర్శకత్వంలో అటు పార్టీని, ఇటు ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్న లోకేశ్ పనితీరు, పట్టుదలలో తండ్రికి తీసిపోనని నిరూపించుకున్నారని పేర్కొన్నారు. 200 పైగా తెలుగు వారితో నేరుగా మాట్లాడి, వారికి లోకేశ్ ధైర్యాన్నిచ్చారని తెలిపారు. తెలుగు వారిని సురక్షితంగా స్వస్థలాలకు తరలించడంలో లోకేశ్ నిజంగా విజయం సాధించారని ప్రశంసించారు.

సోషల్ మీడియాలో అసత్య ప్రచారం.. వ్యక్తి అరెస్టు

దాచేపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల గురించి తప్పుడు పోస్టులను పెట్టిన వ్యక్తిపై కళాశాల ప్రిన్సిపల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోషల్ మీడియా నిర్వాహకుడిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. దాచేపల్లిలోని బాలుర హాస్టల్‌లో తోటి విద్యార్థిపై స్నేహితులు తీవ్రంగా దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ఘటనపై వినుకొండకు చెందిన అబ్బూరి శ్రీనివాసరావు అనే సోషల్ మీడియా నిర్వాహకుడు దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఘటన జరిగినట్టు ప్రచారం చేశారు. తమకు సంబంధంలేని విషయాలపై తప్పుడు ప్రచారం చేశారని కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరరావు ఫిర్యాదు చేశారు. సీఐ భాస్కరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేకం..ఆ అధికారి తీరు!

● ఎమ్మెల్యేకు ఫిర్యాదు

రాజుపాలెం,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి తీరుపై స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ శ్రీవల్లి, తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. విద్యార్థులతో పాఠశాల ప్రత్యేక అధికారి జ్యోతిర్మయి వ్యవహరిస్తున్న విధానం సరిగా లేదని ఆరోపిస్తున్నారు. విద్యార్థినులను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, కులమత బేధాలు చూపిస్తున్నారని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా హిందువుల పండగలకు సెలవులు ఉన్నా.. ఇళ్లకు విద్యార్థినులను పంపించడం లేదని ఆరోపించారు. వినాయక చవితికి పిల్లలను పంపమని పాఠశాల గేటు వద్దకు చేరిన తల్లిదండ్రులను, ఛైర్మన్‌ను వర్షం పడుతున్నా.. కనీసం గేటు తీయించలేదని పేర్కొన్నారు. పాఠశాలలో మరమ్మతులు జరిపి ఛైర్మన్‌కు తెలియకుండా ఎక్కువ మొత్తంలో డబ్బులు డ్రా చేస్తున్నారని ఆరోపించారు. భోజనంలో కూడా ఇద్దరికి కలిపి ఒక కోడిగుడ్డు వేస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.

ఆటో డ్రైవర్‌కు 16 నెలల జైలు

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు సత్తెనపల్లి రెండవ అదనపు కోర్టు జడ్జి జె.సుజిన్ కుమార్ మూడు సెక్షన్‌లకు సంబంధించి శుక్రవారం 16 నెలల జైలు, రూ.11వేల అపరాధ రుసుం విధించారని అమరావతి ఎస్‌హెచ్‌ఓ అచ్చియ్య తెలిపారు. మండల పరిధిలోని మల్లాది వద్ద 2017లో జూపూడి నుంచి మల్లాది వైపు ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్తుండగా వెనుక నుంచి రుద్రమాల జేసు తన ఆటోతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జెట్టి నాగేంద్రం, మెరుగుమల చెన్నమ్మ మృతి చెందారు. అప్పటి ఎస్ఐ బి.నరసింహారావు కేసు నమోదు చేశారు. బాధితుల తరుపున ఏపీపీ ప్రసాద్ నాయక్ వాదనలు వినిపించారు.

స్కూల్ బస్సు ఢీకొని న్యాయవాది మృతి



బైక్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ స్కూల్ బస్సు, మృతుడు జనార్దనరావు

బాపట్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదురు వన్ వే రోడ్డుపై శుక్రవారం ఉదయం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు బైకును ఢీకొట్టింది. బైక్‌పై వెళ్తున్న హైకోర్టు న్యాయవాది సి.హెచ్.జనార్దనరావుకు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం ఆయన మృతి చెందారు. రోడ్లపై వాహనాలు విచ్చలవిడిగా నడపటం వల్ల ఈ విధంగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. నియంత్రణకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొత్త కలెక్టర్‌కు.. సవాళ్ల స్వాగతం!

(5వ పేజీ తరువాయి)

సంకల్పించినా అమలు జరగడం లేదు. వినుకొండ. మాచర్ల నియోజకవర్గంలో ఎస్‌ఎంఈలకు స్థలాలు కేటాయించి మిన్నకున్నారు. రూ.4,735 కోట్ల పెట్టుబడితో నాలుగు భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి 4,300 మందికి ఉపాధి కల్పన ప్రతిపాదనలకే ఏళ్ల తరబడి పరిమితమైంది. జిల్లాలో ఏ ఒక్కచోట ఆటోనగర్‌లు ఏర్పాటు కాలేదు. వీటి ఏర్పాటుపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్

జిల్లా అంతటా అక్రమ మైనింగ్ యథేచ్ఛగా సాగుతోంది. అధికార పార్టీ అండతో సహజ వనరులు కొల్లగొడుతున్నారు. చివరకు కృష్ణా నదిని కూడా అక్రమార్కులు వదలడం లేదు. గ్రానైట్ అక్రమ రవాణా జిల్లా గుండా పెద్ద ఎత్తున సాగుతోంది. గ్రానైట్ ఆదాయంను పూర్తిగా ప్రభుత్వం కోల్పోతోంది. సున్నం రాయి అక్రమ తవ్వకాలు కూడా జరుగుతున్నాయి. మట్టి దందా ఇక చెప్పనవసరం లేదు. ప్రతి నెల ప్రభుత్వం మైనింగ్ ఆదాయాన్ని రూ.10 కోట్ల నుంచి 15 కోట్లు వరకు కోల్పోతున్నట్టు అంచనాగా ఉంది. జిల్లా ఉన్నతాధికారులు అక్రమ మైనింగ్‌ను అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని చెప్పవచ్చు. మైనింగ్ ఆదాయాన్ని చేజార్చుకోండంలో జిల్లా ముందు వరుసలో నిలిచింది.

● పేదల గృహ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. 44,737 గృహాలు చేపట్టగా ఇప్పటికి 17,585 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. టిడ్కో 12,512 గృహాలకు గాను 6,016 గృహాలను మాత్రమే నిర్మించారు. పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు వీటిని అప్పగించలేదు.

● జలజీవన్ మిషన్ అమలులో జిల్లా చిట్టచివరన నిలిచింది. రూ.508.17 కోట్లతో 1,055 పనులు చేపట్టగా 345 మాత్రమే పూర్తయ్యాయి. వాటర్ గ్రిడ్ కింద రూ.1,200 కోట్లతో నీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి నాగార్జునసాగర్‌లో స్థల సమస్య వెంటాడుతోంది. పట్టణాల్లో అమృత్ 2.0 పథకం కింద నీటి పథకాల విస్తరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం టెండర్ దశ కూడా దాటలేదు.

● అమరావతి, నాగార్జున సాగర్, కోటప్పకొండ, కొండవీడు పర్యాట కేంద్రాల అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. స్వదేశ్ దర్శన్ 2.0 కింద రూ.25 కోట్ల వ్యయంతో నాగార్జునసాగర్, అనుపు, నాగార్జున కొండ ప్రపంచ బౌద్ధ వారసత్వ ప్రదేశంగా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినా ఈ పనులు ఇంకా పట్టాలెక్కలేదు.

● ప్రధాన జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం నిధులు కేటాయించినా పనులు చేపట్టడం లేదు. రహదారుల నిర్మాణానికి భూసేకరణ అడ్డంకిగా మారింది. వినుకొండ - పేరేచర్ల, కొండమోడు - పేరేచర్ల, చిలకలూరిపేట - నకరికల్లు అడ్డరోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించేందుకు భూ సమస్యలు పరిష్కారం కాక పనులు చేపట్టే పరిస్థితిలేదు.

● ప్రగతి పనుల్లో వెనుకబాటు స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లాలో తాగు, సాగు నీటి ప్రాజెక్టులు పూర్తిగా నిలిచిపోయాయి. ఏ ఒక్క పథకంలోనూ పురోగతి కనిపించ లేదు. బుగ్గవాగు సామర్థ్యం పెంపు కాగితాలకే పరిమితమైంది. జిల్లాలో తాగునీటి సమస్యను పరిష్కరించే లక్ష్యంతో చేపట్టిన పల్నాడు వాటర్ గ్రిడ్, గోదావరి జలాలను సాగర్ కుడి కాల్వకు తరలించే ఎత్తిపోతల పథకం.. వరికపూడిశెల ఎత్తిపోతల.. తంగెడ, మాచవరం ఎత్తిపోతల పథకాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడినే అన్న చందాన మారాయి.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

15న ప్రసన్నాంజనేయ స్వామి వారి ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం

బెల్లంకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న కోళ్ళూరి ప్రసన్నాంజనేయస్వామి వారి ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారాన్ని ఈ నెల 15వ తేదీన జరపనున్నట్టు బెల్లంకొండ మండల దేవదాయ శాఖ అధికారి ఎస్. కోటిరెడ్డి పేర్కొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా టీడీపీ నాయకుడు ఆసుల జగన్, కమిటీ సభ్యులుగా పది మందిని ఎంపిక చేయటం జరిగిందన్నారు. కోళ్ళూరి ప్రసన్నాంజనేయస్వామి వారి ఆలయం వద్ద ప్రమాణ స్వీకార మహోత్సవం జరుగుతుందన్నారు.

నూతన టీడీపీ కమిటీ సభ్యులకు సత్కారం

పిడుగురాళ్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గురజాలలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పిల్లి చెన్నారావు, మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్‌లను శుక్రవారం షాదీఖానాలో పట్టణ మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు పాండురంగ శ్రీనివాసరావును పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు ఘనంగా సత్కరించారు.

టీచర్ల ఫెడరేషన్ నిరసన

కారంపూడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కారంపూడిలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నేతలు భాస్కర్ రావు, శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, ఎండీ షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా శ్రీనివాసరావు నియామకం



రెంటచింతల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెంటచింతల మండల ఎంపీడీవోగా సీహెచ్ శ్రీనివాసరావును నియమిస్తూ జడ్పీసీఈవో వి.జ్యోతిబసు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెంటచింతల ఈవోపీఆర్డీగా పనిచేస్తూ ఎంపీడీవోగా పదోన్నతి పొందారు. 38 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో పనిచేసిన శ్రీనివాసరావు రెంటచింతల మేజర్ పంచాయతీ కార్యదర్శిగా కూడా పనిచేశారు. శనివారం బాధ్యతలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా బొమ్మలగుడి రాములవారి కల్యాణం

పెదకూరపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులోని బొమ్మలగుడి రామాలయం (పట్టాభి రామచంద్ర స్వామి) శతవార్షికోత్సవం సందర్భంగా నాలుగు రోజులుగా ప్రత్యేక పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. చలమచర్ల సూర్యనారాయణాచార్యులు, రామానుజాచార్యులు ఆధ్వర్యంలో శుక్రవారం నిత్య హోమం, మహా పూర్ణాహుతి, సంప్రోక్షణ, ప్రత్యేక హోమాలను నిర్వహించి సీతారాముల వారి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు.

రేపు దాచేపల్లిలో మెగా వైద్య శిబిరం

దాచేపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ళ పట్టణానికి చెందిన ఉన్నం హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు ఉన్నం నాగమల్లేశ్వరరావు తెలిపారు. శుక్రవారం దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పది రకాల వైద్యులతో వివిధ రోగాలపై ఉచితపరీక్షలు, మందులు, భోజనవసతి కల్పిస్తున్నట్టు వివరించారు. ఈ నెల 14వ తేదీన ఆదివారం దాచేపల్లి జడ్పీ హైస్కూల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి నివాళి

మాచర్ల రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 31వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త మందా గురవయ్య శుక్రవారం అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వార్డుకు చేరుకొని గురవయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నకరికల్లు పీఏసీఎస్ చైర్మన్‌గా వెంకటరావు

నకరికల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నకరికల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా నకరికల్లుకు చెందిన తిరుమలశెట్టి వెంకటరావును ఎంపిక చేశారు. తన నియామకానికి కృషిచేసిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు, టీడీపీ నేతలు నాగోతు శౌరయ్య, కనుమూరి బాజీ చౌదరికి వెంకటరావు కృతజ్ఞతలు తెలిపారు. సహకార సంఘం పరిధిలోని రైతులకు సేవలు అందిస్తానని వెంకటరావు తెలిపారు.

కుంకుమ బస్తాలు అందజేత

దాచేపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నాటక రాష్ట్రంలోని శృంగేరి శారదాపీఠంలో జరగనున్న దేవీ శరన్నవరాత్రులకు ఉపయోగించే కుంకుమను దాచేపల్లిలోని శ్రీఅంకమ్మతల్లి దేవస్థాన భక్తుల తరఫున అందజేశారు. 300కేజీల కుంకుమ బస్తాలను జగద్గురు శృంగేరి శారదా పీఠాధిపతులు విధుశేఖర భారతీ మహాస్వామికి యనమల నరేష్, చదలవాడ వెంకట తులసీ సుధాకర్, తదితర భక్తులు కలసి అందజేశారు.



కర్నాటకలోని శృంగేరి శారదా పీఠానికి కుంకుమ బస్తాలను సమర్పించుకుంటున్న దాచేపల్లి అంకమ్మ తల్లి భక్తులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయవరం, కంభంపాడు సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్ల మరమ్మతులు నిమిత్తం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ రూరల్ ఏఈ షేక్ గౌస్ తెలిపారు. కారంపూడి మండలంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ పెదమస్తాన్ తెలిపారు.

● మాచర్ల, దాచేపల్లి, మాచవరం, దుర్గి, గురజాల టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మాచర్లలో, నడికుడి సబ్ స్టేషన్ పరిధిలో, మాచవరం, దుర్గి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

● సత్తెనపల్లి: విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 13వ తేదీ శనివారం పట్టణంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

● రాజుపాలెం: మండలంలోని రాజుపాలెం, గణపవరం, అనుపాలెం గ్రామాలలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్లలోని 33కేవీ, 11కేవీ లైన్లు మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపియనున్నట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాస్కరరావు తెలిపారు.

● బెల్లంకొండ : బెల్లంకొండ, పాపాయపాలెం సబ్ స్టేషన్ పరిధిలో గల 33కేవీ, 11కేవీ లైన్‌ల మరమ్మత్తుల దృష్ట్యా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు బెల్లంకొండ విద్యుత్ ఏఈ పవన్ కుమార్ పేర్కొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో 30స్వయం సహాయక సంఘాలకు వివిధ బ్యాంకుల ద్వారా రూ.4కోట్ల రుణాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు. మహిళలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు భీమినేని వందనాదేవి, మన్నవ శారద, పీ అంబిక, జీ సుశీల, బీ రాజేశ్వరి, మెప్మా సిబ్బంది, పలువురు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఓర్వలేకనే జగన్ విమర్శలు

నకరికల్లు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో ఉన్న మద్దతును చూసి వైసీపీ అధినేత జగన్ ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం రాత్రి నకరికల్లు టీడీపీ కార్యాలయంలో మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. టీడీపీ అనుబంధ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాగోతు శౌరయ్య, షేక్ ఆలీబాషా, వేల్పుల ఆవుల రాజు, తిరుమలశెట్టి వెంకటరావు, షేక్ అలీ బాషా, ఆకుల వెంకటేశ్వర్లు, సాగి శ్రీను పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా జమ్మిగుంపుల

గురజాల టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ గురజాల మండల అధ్యక్షుడిగా జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ రెండోసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో లక్ష్మీనారాయణను టీడీపీ శ్రేణులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో రెండోసారి తనకు పదవి అప్పగించిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పలుచూరి నాగేశ్వరరావు, బిక్కి పూర్ణ, నవీన్, హరికృష్ణ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



పాఠశాల పునఃప్రారంభ వేడుకల్లో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 31వ వార్డులో ఉన్న 11వ బ్లాక్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆధునికీకరణ పునఃప్రారంభ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, దుస్తులు, బ్యాగులు అందుతున్నాయన్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలను తీర్చిదిద్దిన హెచ్‌ఎం విజయలక్ష్మి పండిట్ కిరీటిరెడ్డిని ఆయన అభినందించారు. పాఠశాలలో టాయిలెట్లు, తరగతిగదులు, ఫ్లోరింగ్ బాగుచేత, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలకు హెచ్‌ఎం తన సొంత నిధులు రూ.3 లక్షలు వెచ్చించారన్నారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణుడు డాక్టర్ రామలింగారెడ్డి, డాక్టర్ గుర్రం రాజశేఖరరెడ్డి, ఎంఈవోలు జ్యోతి, అల్లి సురేష్, ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జె బాలస్వామి, మాగులూరి రాంబాబు, మాచర్ల బాబు, కంభంపాటి దానం బాబు, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు విజయకుమారి, ఉషారాణి, ఉపాధ్యాయినిలు భవాని, మాధవి, రజనీకాంతం, చరిత పాల్గొన్నారు.

యూరియా కోసం బారులుదీరిన రైతులు



క్రోసూరు: సొసైటీ వద్ద యూరియా తీసుకువెళ్తున్న రైతులు



కారంపూడి: రైతులతో మాట్లాడుతున్న ఏవో నరసింహారావు



బెల్లంకొండ: రైతులకు యూరియా అందజేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు

● టోకెన్లు ఇచ్చి యూరియా పంపిణీ

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న జీడీసీఎంఎస్ ఎరువుల గోదాము వద్దకు శుక్రవారం రైతులు యూరియా కోసం అధిక సంఖ్యలో బారులుతీరారు. గోదాముకు 440 బస్తాలు యూరియా రావటం, రైతులు భారీగా తరలిరావటంతో అధికారులు తక్షణమే స్పందించారు. ఏడీఏ రవిబాబు, ఏవో సుబ్బారెడ్డిలు గోదాము వద్దకు వచ్చి రైతులతో మాట్లాడారు. రైతులకు టోకెన్‌లు అందజేసి నిల్వ ఉన్నంత వరకు యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ రవి బాబు మాట్లాడుతూ ఎరువుల కోసం రైతులెవ్వరూ ఆందోళన చెందవద్దని, యూరియా నిల్వలు సరిపడ ఉన్నాయన్నారు. జీడీసీఎంఎస్ గోదాము వద్దకు మండలంలోని రైతులే కాకుండా ముప్పాళ్ళ, మేడికొండూరు మండలాలకు చెందిన రైతులు కూడా యూరియా కోసం వచ్చారు.

● క్రోసూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలంలో అధికారులు శుక్రవారం రైతులకు ముమ్మరంగా యూరియా పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్ క్రోసూరు సొసైటీలో ఎరువుల పంపిణీని పర్యవేక్షించారు. ఇప్పటి వరకు డీసీఎంఎస్ ద్వారా 176.9, పీఏసీఎస్ ద్వారా 99, ఆర్ఎస్‌కేల ద్వారా 59.4, ప్రైవేట్ డీలర్ల ద్వారా 4428, మొత్తం 763.3 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశారు. శుక్రవారం క్రోసూరు పీఏసీఎస్ ద్వారా 19.8 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామన్నారు. రైతులు భూములు దెబ్బతినకుండా ఉండాలంటే నానో యూరియాను ఉపయోగించాలన్నారు.

● కారంపూడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలానికి సరిపడా ఎరువులు వస్తున్నాయని, రైతులు కంగారుపడవద్దని ఏవో పోట్ల నరసింహారావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఒప్పిచర్లలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ కారంపూడిలోని ప్రాథమిక సహకార సంఘానికి, జీడీసీఎంఎస్, మన గ్రోమోర్ కేంద్రాలకు, ప్రైవేటు డీలర్లకు కూడా యూరియా సరఫరా అవుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● బెల్లంకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అమల కుమారి, మండల టీడీపీ నాయకుడు అక్కల వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రవీణ్ ఆదేశాలతో బెల్లంకొండ మండలంలోని వెంకటాయపాలెం, మన్నె సుల్తాన్‌పాలెం, యామ్మాజీగూడెం, పాపాయపాలెం గ్రామాల్లోని రైతులకు యూరియాను అందజేసినట్టు పేర్కొన్నారు. రైతులు అవసరమైన మేరకే యూరియాను కొనుగోలు చేయాలని టీడీపీ నాయకులు అక్కల వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులతో పాటు టీడీపీ నాయకులు అక్కల సుబ్బారెడ్డి, వర్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ హనుమంతరావు, రాజేష్, వర్ల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలని నిరసన

రాజుపాలెం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పెండిగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ తలపెట్టిన నిరసన ప్రదర్శన రెండో రోజు కార్యక్రమం తహశీల్దార్ కార్యాలయం ముందు జరిగింది. కార్యక్రమంలో అద్దంకి శ్రీధర్, కొడవటి రవికుమార్, రాంబాబు, సీతారావమ్మ, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, రమేష్, రత్తయ్య, మల్లేల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాచర్లలో చోరీ

మాచర్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వ వార్డుకు చెందిన నల్లమల రవీంద్రనాథ్ గృహంలో చోరీ జరిగింది. రవీంద్రనాథ్ తల్లి సుశీల ఈ నెల 6వ తేదీన హైదరాబాద్‌లోని తన కుమార్తె ఇంటికి వెళ్లింది. అంతకుమునుపే రవీంద్రనాథ్ హైదరాబాద్ వెళ్లారు. శుక్రవారం ఉదయం 11:30 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలతోపాటు ఇంట్లోని బీరువాలు పగులకొట్టి ఉండడాన్ని గుర్తించారు. బీరువాల్లోని రెండు జతల బుట్టలు, జత మాటీలు, 3 ఉంగరాలు, రెండు జతల వెండి పట్టీలు అపహరణకు గురైనట్లు గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ ప్రభాకరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు



విజిలెన్స్ తనిఖీల వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలలో మీటర్లు లేకుండా డైరెక్ట్‌గా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న, అదనపు లోడు వాడుతున్న, వాడకం కంటే తక్కువ బిల్లు వస్తున్నట్లు గుర్తించిన కొందరికి 8.72 లక్షల అపరాధ రుసుం విధించడం జరిగిందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎస్.సింగయ్యలు తెలిపారు. సుమారు 60మంది విద్యుత్‌శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి పట్టణ పరిధిలో మీటరు తనిఖీలు చేపట్టగా అనధికార లోడు, విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించడం జరిగింది. ఈ తనిఖీలలో డీఈఈ నాగ సురేష్‌బాబు, కె.రవికుమార్, ఎన్.మల్లికార్జున ప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, ఏఈలు బి.పోతురాజు, కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా ఫ్రైడే డ్రైడే పాటించాలి

● అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్



లింగాపురంలో డ్రైడే కార్యక్రమం అమలును పర్యవేక్షిస్తున్న డాక్టర్ శివరత్నకుమార్

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని పలు గ్రామాలలో ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని అత్తలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివరత్నకుమార్ అన్నారు. శుక్రవారం లింగాపురం గ్రామంలో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. చావపాడులో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని అమరావతి ఉప ఆరోగ్యకేంద్రం వైద్యురాలు డాక్టర్ మౌనిక పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి విషజ్వరాల బారిన పడినవారిని గుర్తించి వారికి వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. జ్వర పీడితులు ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా రక్తపరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి కె.లక్ష్మీమనోహర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు హామీలు విస్మరించటం పరిపాటిగా మారింది

● ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించటం ప్రభుత్వాలకు పరిపాటిగా మారిందని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం విమర్శించారు. ఉపాధ్యాయ, ఉద్యోగస్థుల, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీటీఎఫ్ సత్తెనపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి ఉపాధ్యాయులను మోసగిస్తే ఈ ప్రభుత్వం సీపీఎస్ రద్దు విషయంలో ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని మేనిఫెస్టోలో ప్రకటించి నేటికి ఆ ఊసే ఎత్తకపోవటం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, ఏపీజేఏసీ నాయకులు ఎస్. అంబేద్కర్, మండల శాఖ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్ ఖాన్, మండల కార్యదర్శి శివారెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు ఉషారాణి, అక్తరున్నీసా, సునీల్ కుమార్, భవనం సుబ్బారెడ్డి, లెనిన్‌రాణి, దామోదరం తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నగర పంచాయతీ పరిధిలోకి తాగునీటి కుళాయిల పన్ను

● కమిషనర్ శివన్నారాయణ

గురజాల టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గురజాల నగర పంచాయతీలోని తాగునీటి కుళాయిల పన్నులు నగర పంచాయతీ కమిషనర్ శివన్నారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ ఏర్పడి ఐదేళ్లు అయిందన్నారు. గురజాల, జంగమహేశ్వరపాడు పంచాయతీలుగా ఉన్నప్పుడు గ్రామ పంచాయతీలకు రుసుజ చెల్లించి నీటిని వినియోగించుకునేవారన్నారు. మొత్తం కుళాయిలను ఈఆర్పీల విధానంలోకి వచ్చేలా నీటి సరఫరా ఆప్కోస్ సిబ్బందికి సూచనలు జారీ చేశామన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న బకాయిదారుల నుంచి కూడా నీటిపన్నులు వసూలు చేయించేలా సూచించామన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు కూడా డిమాండ్ నోటీసులు జారీచేశామన్నారు. పన్నులచెల్లింపులో సహకరించి నగర అభివృద్ధి తోడ్పాటు అందించాలన్నారు.

కస్తూర్బా పాఠశాల ఎస్‌వోపై ఎమ్మెల్యేకి ఫిర్యాదు

రాజుపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ ప్రత్యేక అధికారి జ్యోతిర్మయిపై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు ఆ పాఠశాల చైర్మన్ శ్రీవల్లి, టీడీపీ మండల నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు ప్రత్యేక అధికారి జ్యోతిర్మయిపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎస్‌వో పాఠశాలలో కులమత బేధాలు చూపిస్తోందన్నారు. హిందువుల పండుగలకు విద్యార్థినులను ఇళ్లకు పంపటం లేదని ఆరోపించారు. వినాయక చవితికి పిల్లలను ఇళ్లకు పంపాలని పాఠశాల చైర్మన్‌గా తాను, మరి కొంతమంది విద్యార్థినుల తల్లిదండ్రులు వస్తే గేటు వద్దే ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా విద్యార్థినులను అసభ్య పదజాలంతో దూషిస్తోందని ఆరోపించారు. పాఠశాలలో ఫ్యాన్లు, మోటరు మరమ్మతులు చైర్మన్‌కు తెలియకుండా చేయించి అధిక మొత్తంలో డబ్బులు డ్రా చేసుకుంటుందని ఆరోపించారు. భోజనంలో ఒక కోడిగుడ్డును ఇద్దరు పిల్లలకు ఇస్తున్నారన్నారు. తల్లిదండ్రులతో కలిసి పాఠశాలలో పరిస్థితిపై మాట్లాడేందుకు వచ్చినా పాఠశాలలోకి రానివ్వటం లేదని చైర్మన్ సులగా శ్రీవల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును స్వీకరించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చర్యల నిమిత్తం డీఈవోకు ఫిర్యాదు కాపీని పంపారు.

మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

● టీడీపీ సీనియర్ నేత యాగంటి

మాచర్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1930కోట్లు కేటాయించేలా చేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నిలబెట్టుకున్నారని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటికే రూ.350కోట్లు కేటాయించారన్నారు. పల్నాడు ప్రాంత ప్రజలకు తాగు, సాగునీరు అందించడమే ఎమ్మెల్యే లక్ష్యమన్నారు. నియోజకవర్గ నిరుద్యోగుల కోసం ఇప్పటికే 8సార్లు జాబ్‌మేళాలు నిర్వహించారన్నారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లను నిర్మిస్తున్నారన్నారు. యువనేత లోకేశ్ నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని తెచ్చేందుకు చేసిన కృషి అభినందనీయమన్నారు. నూతన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రజల అభ్యుదయానికి కూటమి ప్రభుత్వం పాటుపడుతోందని యాగంటి అన్నారు.

గురుకులం స్థలాన్ని పరిశీలించిన ఐటీడీఏ డీఈ

రెంటచింతల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మిట్టగుడిపాడులోని 447/3 సర్వే నెంబర్‌లోని 5 ఎకరాల స్థలాన్ని ఐటీడీఏ డీఈ రియాజుద్దీన్ శుక్రవారం పరిశీలించారు. ఇక్కడ గిరిజన సంక్షేమ గురుకులాన్ని నిర్మించడానికి ప్రభుత్వం రూ.4 కోట్ల 10లక్షల 90వేలను మంజూరుచేసింది. టెండర్లు కూడా పూర్తయ్యాయి. నిర్మాణపనులకు భూమిపూజ చేయనున్న నేపథ్యంలో అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.మోహన్ ఉన్నారు.

కాల్వ చివరి భూములకూ నీరందిస్తాం

● డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు

పెదకూరపాడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాల్వ చివరి భూములకు కూడా సాగునీటిని అందిస్తామని, ఇందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేశామని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు అన్నారు. పెదకూరపాడులోని ఎన్ఎస్ కెనాల్స్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ కార్యాలయంలో శుక్రవారం 14వ డిస్ట్రిబ్యూటరీ కమిటీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అప్పారావు మాట్లాడుతూ కాలువల్లో నీటి సరఫరా, నీటి నియంత్రణ, వృథా నీటిని అరికట్టడం, రెగ్యులర్ లస్కర్ల సమస్యలపై చర్చించారు. సమావేశంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ మందడి నరసింహారావు, ఏఈలు చిరంజీవిరెడ్డి, నరేంద్రకుమార్, సాగు నీటి సంఘ అధ్యక్షులు, ఎన్ఎస్ కెనాల్స్ డీఈ కృష్ణ, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మాచర్ల - విజయవాడ ట్రైన్‌కు బోగీలు పెంచండి

● జడ్‌ఆర్‌యూసీసీ సభ్యురాలు రాధ

పిడుగురాళ్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాచర్ల - విజయవాడ రూట్‌లో వెళ్తున్న మెమో రైలుకు అదనపు బోగీలు ఏర్పాటు చేయాలని, ప్రయాణికుల సౌకర్యార్థం మరో రైలు నడిపేలా చూడాలని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యురాలు కొంకా రాధ అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరులోని రైల్వే డివిజనల్ మేనేజర్, అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పల్నాడు ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి మాచర్ల నుంచి విజయవాడ వరకు వెళ్లే మెమో రైలుకు బోగీలు పెంచాలని కోరారు.

కరాటే పోటీలలో దమ్మాలపాడు విద్యార్థుల ప్రతిభ

ముప్పాళ్ళ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): దమ్మాలపాడులోని ఎస్ఎస్‌జీ అండ్ ఎస్‌జడ్పీ హైస్కూల్ విద్యార్థులు కరాటే పోటీలలో ప్రతిభ చాటారు. నరసరావుపేట కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో శుక్రవారం జరిగిన అండర్-14, 15 జిల్లా స్థాయి కరాటే సెలక్షన్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. పీడీఎస్ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం నూర్‌భాషా సిద్ధయ్య, విద్యాకమిటీ చైర్మన్ సూరంశెట్టి సతీష్, వైస్‌చైర్మన్ చావా శాంతకుమారి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ శిరిగిరి సాంబశివరావు, కోచ్ రవిలు విద్యార్థులను అభినందించారు. అండర్-14 36 కేజీల బాలికల విభాగంలో కె ఫర్హానా ప్రథమస్థానం, బాలుర విభాగంలో కట్టా హరినాథ్, గనుపల్లి వేళాంగిరాజు ప్రథమస్థానం, యర్రంశెట్టి మనోజ్‌కుమార్ ద్వితీయ స్థానం, అండర్-17 బాలికల విభాగంలో పసుపులేటి సాయి పూజిత, బూర్ల దివ్యశ్రీ ప్రథమస్థానం, కంభాల కీర్తన, షేక్ గన్‌సైదల్లి, దమ్మాలపాటి యశస్విని, గోగుల దేవజ్యోతి ద్వితీయస్థానం కైవసం చేసుకున్నట్లు హెచ్‌ఎం నూర్‌భాషా సిద్ధయ్య తెలిపారు.

ఇన్‌చార్జి ఈవోపీఆర్డీగా పి.బాబులాల్

రెంటచింతల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెంటచింతల మండల ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ (ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) పి.బాబులాల్‌ను నియమిస్తూ పల్నాడు జిల్లా డీపీవో ఎస్వీ నాగేశ్వరరావు నాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం గోలి గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

తల్లి జన్మనిస్తే.. రక్తదాత పునర్జన్మనిస్తారు

● టీడీపీ అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య

పెదకూరపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తల్లి జన్మనిస్తే రక్తదాతలు పునర్జన్మనిస్తారని మండల టీడీపీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. పెదకూరపాడులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీలి ధనలక్ష్మి, ఎంపీడీవో సోమయాజులు, రెడ్‌క్రాస్ జిల్లా కో-ఆర్డినేటర్ పీ వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ డీ శరత్, మండల టీడీపీ నాయకులు మద్దినేని వెంకటసత్యనారాయణ, పాటిబండ్ల యోహాన్, ఏటుకూరి సురేష్, కొండవీటి ప్రసాదు పాల్గొన్నారు. రక్తదానం చేసిన వారికి రెడ్‌క్రాస్ ప్రశంసా పత్రాలను అందించారు.



శిబిరంలో రక్తదానం చేస్తున్న దృశ్యం

ఇళ్లపై విస్తరిస్తున్న సోలార్ పలకలు..

● సూర్యఘర్ పథకంపై ప్రజల ఆసక్తి
● వేమూరులో 312 మంది రాయితీ వినియోగం
● యాప్ ద్వారా దరఖాస్తులు ● అదాని కంపెనీ.. ఆటోమెటిక్ మీటర్లు

వేమూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ బిజిలి యోజన ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బంపర్ ఆఫర్‌తో రాయితీలు ప్రకటించడంతో విద్యుత్ వినియోగదారులు సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. 200 యూనిట్స్ వరకు విద్యుత్ ఉచితంగా పొందే ఎస్సీ ఎస్టీ వినియోగదారులకు ప్రభుత్వం ఉచితంగా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తోంది. బీసీ, ఓసీలకు సబ్సిడీని ప్రకటించడంతో వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో పీఎం సూర్యఘర్ యాప్ ద్వారా ప్రజలు దరఖాస్తు చేసుకుంటున్నారు. కేవలం 45 రోజుల వ్యవధిలో నియోజకవర్గం నుంచి 312 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం రాయితీపై రెండు రోజుల వ్యవధిలోనే వారి గృహాలపై సోలార్ పవర్ సిస్టం ఏర్పాటు చేసింది. ప్లేట్స్ ఏర్పాటు చేసిన తక్షణమే అదానీ కంపెనీ ద్వారా ఆటోమేటిక్ మీటర్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ మీటర్ల ద్వారా ట్రాన్స్ కో సిబ్బంది విద్యుత్ యూనిట్స్ రికార్డు చేస్తారు. వినియోగదారుడి గృహ అవసరాలకు సరిపోను..మిగులు విద్యుత్‌ను ఆటోమేటిక్‌గా ట్రాన్స్ కో సిస్టంకు చేరుతుంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి ట్రాన్స్ కో యూనిట్‌కు రెండు రూపాయల పది పైసల చొప్పున వినియోగదారుని బ్యాంకు ఖాతాకు జమ చేస్తుంది. వేమూరు మండలంలో 85, చుండూరు మండలంలో 52 , అమృతలూరులో 60, భట్టిప్రోలులో 70, కొల్లూరు మండలంలో 45 మంది వినియోగదారులు సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకున్నట్లు ట్రాన్స్ కో అధికారులు వివరించారు. వీరంతా 3 కిలోవాట్స్ ప్లేట్స్‌ను ఏర్పాటు చేసుకున్నారు. వాటి ఖరీదు రూ.2 లక్షలు కాగా ప్రభుత్వం ఇచ్చే రూ.78 వేలు రాయితీ ఇస్తోంది. మిగిలింది వినియోగదారుడు చెల్లించాలి.. దీనికి కూడా బ్యాంకర్లు రుణ సదుపాయం కల్పించేందుకు వినియోగదారులకు సహకరిస్తున్నారు.


వేమూరులో వినియోగదారుని ఇంటిపై సోలార్ ప్లేట్స్ బిగిస్తున్న టెక్నీషియన్లు

నరసపూర్, మైసూరుకు ప్రత్యేక రైళ్లు



గుంటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పండగల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా నరసపూర్, మైసూరుకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07033 నరసపూర్ - మైసూరు ప్రత్యేక రైలు ఈ నెల 19, 22, 26, 29, అక్టోబరు 3, 6, 10, 13, 17, 20, 24, 27, 31 తేదీల్లో ఉదయం 11.35కి బయలుదేరి మధ్యాహ్నం 3.15కి గుంటూరు, 4.03కి సత్తెనపల్లి, 4.33కి పిడుగురాళ్ల, సాయంత్రం 5.03కి నడికుడి, రాత్రి 10.05కి సికింద్రాబాద్, మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు మైసూరుకు చేరుకొంటుంది. 07034 మైసూరు - నరసపూర్ ప్రత్యేక రైలు ఈ నెల 20, 23, 27, 30, అక్టోబరు 4, 7, 11, 14, 18, 21, 25, 28, నవంబరు 1 తేదీల్లో సాయంత్రం 5.20కి బయలుదేరి రాత్రి 8.45కి బెంగళూరు, మరుసటి రోజు ఉదయం 10.10కి సికింద్రాబాద్, మధ్యాహ్నం 12.58కి నడికుడి, 1.28కి పిడుగురాళ్ల, 1.58కి సత్తెనపల్లి, సాయంత్రం 4.45కి గుంటూరు, రాత్రి 9 గంటలకు నరసపూర్ చేరుకొంటుందన్నారు. స్లీ పర్, ఏసీ త్రీటైర్, టూ టైర్ బోగీలు ఉంటాయి.

ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యంతో..
ప్రాణం పోతోంది

అన్నింటికీ..యాంటీ బయోటిక్స్

సత్తెనపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా తురకపాలెంలో తీవ్ర కలకలం రేపిన వరుస మరణాల కేసులో స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అంటున్నారు. కలుషితమైన సిలేన్ వాడకం, మోతాదుకు మించి శక్తి వంతమైన యాంటి బయోటిక్స్ వాడినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం సత్తెనపల్లి డివిజన్‌లో కూడా జ్వరాలు ప్రబలుతున్నాయి. గ్రామీణ ప్రజలు ముందుగా ఆర్ఎంపీ వద్దే చికిత్స పొందుతున్నారు.

● సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని బెల్లంకొండ, అచ్చంపేట, క్రోసూరు, రాజుపాలెం, ముప్పాళ్ళ, సత్తెనపల్లి మండలాల్లో గ్రామీణ ప్రాంతాలు ఎక్కువ. ప్రస్తుతం ప్రాథమిక వైద్య చికిత్సల పేరుతో ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లను పొందిన వారు వైద్యుల అవతారం ఎత్తేశారు. కాలు తెగినా కట్టు కట్టాలే తప్ప.. కుట్లు వేయటానికి అర్హత లేని వారు డాక్టర్ బోర్డులు పెట్టుకొని క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. మరి కొంత మంది మెడికల్ షాపులు, ఆస్పత్రులు నిర్వహిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సినిమాలో శంకర్ దాదా ఎంబీబీఎస్ చేయడానికి మోసం చేస్తే నిజ జీవితంలో ఆర్ఎంపీలు ఏకంగా వైద్యం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో కొన్ని చోట్ల ప్రాణాంతక సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఆయా మండలాల్లో రెండు వందల మందికి పైగా ఆర్ఎంపీలు, పీఎంపీలుగా పని చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులుగా అవతారం ఎత్తి ప్రజలపై తమ వైద్య ప్రయోగాలు చేస్తున్నారు. మరి కొంతమంది తమ హస్తవాసి మంచిదంటూ ఆపరేషన్‌లు కూడా చేస్తూ ప్రజల ప్రాణాలను గాలిలో కలిపేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రిళ్లు ప్రభుత్వ, క్వాలిఫైడ్ వైద్యులు అందుబాటులో లేక పోవడంతో ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రజల గుమ్మాల్లో వాలుతున్నారు. సమయానికి వైద్యం చేయడంతో ప్రజల్లో వారిపై నమ్మకం కలుగుతోంది.

● కొందరు ఆర్ఎంపీలు ప్రమాదకర యాంటీ బయోటిక్స్ స్టెరాయిడ్స్ రాస్తున్నారు. దద్దుర్లు వచ్చినా అవే వాడుతున్నారు. వారు ఇచ్చిన స్టెరాయిడ్స్ అత్యధిక పవర్ కలిగిన యాంటీ బయోటిక్స్ వల్ల వైద్యం చేయడానికి ఆస్కారం లేకుండా పోతోంది. కొంత మంది ఆర్ఎంపీ, పీఎంపీలు పట్టణాల్లోని ప్రైవేట్ వైద్యశాలలతో ఒప్పందాలు చేసుకొని తమ ప్రాంతాల నుంచి రోగులను పంపించి పర్సన్‌టేజ్‌లను అందుకుంటున్నారు. ఇంకా కొంత మంది గ్రామాల్లో తమ వద్దకు వచ్చే రోగులకు జనరిక్ మందులను అంటగట్టి అధిక సొమ్ములు వసూలు చేస్తున్నారు. యాంటీ బయోటిక్స్ స్టెరాయిడ్స్‌ను వాడటం వల్ల రోగుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి.. చిన్న వ్యాధిని కూడా తగ్గించుకోలేని పరిస్థితులు వస్తున్నాయి. ఆర్ఎంపీ, పీఎంపీల వద్ద గ్రామాల్లో వైద్యం చేయించుకున్న 30 సంవత్సరాల్లోపు యువకులు కూడా బీపీ, షుగర్ బారీన పడుతున్నారు. ఆర్ఎంపీ, పీఎంపీల వైద్య సేవలపై హైకోర్టు, సుప్రీం కోర్టులు ఎన్నో తీర్పులు ఇచ్చాయి. ప్రభుత్వాలు వాటిని అమలు చేయక పోవడం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు వీటిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి.. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేంద్ర పథకం..వితంతువులకు ఆర్థిక సాయం



● దరఖాస్తు చేసుకుంటే రూ.20 వేలు
● 18-59 మధ్య వయస్సు వారు అర్హులు
● 2017 ఏప్రిల్ 12 తర్వాత భర్త మరణించిన వారికి అవకాశం

వేమూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు పరిచే అనేక పథకాలలో జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్) ఒకటి. ఇది వితంతువుల కోసంగా ప్రవేశపెట్టింది. ఈ పథకం ప్రచారంలో లేక బాధితులకు సాయం అందడం లేదు. ఒక కుటుంబంలో ప్రాథమిక సంపాదన కలిగిన వ్యక్తి మరణిస్తే.. ఒకేసారి రూ.20 వేల సాయం ఈ పథకం ద్వారా అందుతుంది. అతని భార్యకు ఈ సాయాన్ని అందిస్తారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వితంతు మహిళకు మాత్రమే ఈ సంక్షేమ పథకం వర్తిస్తుంది. 2017 ఏప్రిల్ 12వ తేదీ నుంచి ఈ పథకాన్ని అమలులోకి తెచ్చింది. ఈ పథకం అమలులోకి వచ్చిన తదుపరి మృతి చెందిన వ్యక్తి భార్యకు నిబంధనల ప్రకారం వినియోగించుకునే అవకాశం ఉంది. సహజంగా లేదా ఇతరత్రా కారణాలతో మరణించినా పథకం వర్తిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అందించే సాధారణ పింఛన్లు, స్పౌజ్ పింఛన్లు అందుకునే వారు కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించిన దరఖాస్తును మండల రెవెన్యూ కార్యాలయాల్లో ఇస్తారు. దరఖాస్తు పూర్తి చేసి తిరిగి తహసీల్దార్ కార్యాలయంలోనే సమర్పించాలి. దరఖాస్తుతో పాటుగా వయస్సు, మరణించిన వ్యక్తి ధృవీకరణ పత్రాలు, ఆధార్, ఆదాయం, రేషన్ కార్డు జిరాక్సులతో పాటు బ్యాంకు ఖాతా నంబరు కూడా అందించాలి. తహసీల్దార్ దరఖాస్తును పూర్తిగా పరిశీలన చేసిన అనంతరం.. ఆన్‌లైన్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు. కేంద్ర రెవెన్యూ శాఖ ఆమోదంతో లబ్ధిదారులు బ్యాంకు ఖాతాకు రూ.20 వేలు నగదు జమ చేస్తారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ఈ పథకానికి దరఖాస్తులు చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కూడా అర్హులైన మహిళలు పథకాన్ని వినియోగించుకునేందుకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాల్సి ఉంది.

ఆ రైళ్ల కోసం.. నిడుబ్రోలు నిరీక్షణ..!

● రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌కు వినతులు
● దశాబ్దాలుగా తప్పని ఎదురుచూపులు
● గుంటూరు, తెనాలి, బాపట్ల వెళ్తున్న ప్రయాణికులు
● తమలపాకు, మినుముల వ్యాపారులకు అవస్థలు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు రైల్వే స్టేషన్‌కు విశిష్ట స్థానం ఉంది. ప్రముఖ స్వతంత్ర్య సమర యోధుడు ఆచార్య ఎన్జీ రంగా స్వగ్రామం నిడుబ్రోలు. దశాబ్దాల క్రితమే ఈ రైల్వేస్టేషన్ ఏర్పాటైంది. విజయవాడ - చెన్నై ప్రధాన రైలు మార్గంలోని నిడుబ్రోలు రైల్వే స్టేషన్‌లో నిన్న మొన్నటి వరకు వసతుల కొరత వేధించేది. ఇటీవల రైల్వేస్టేషన్‌ను కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి చేశారు. కానీ, ఇక్కడ ఎక్స్ ప్రెస్ రైళ్లకు హాల్టు సౌకర్యం కల్పించ లేదు. ప్రయాణికులు దశాబ్దాలుగా ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపదల కోసం ఎదురుచూస్తున్నారు. ప్యాసింజర్ రైళ్లతో పాటు డివిజన్‌కే పరిమితమైన పినాకిని, పూరి, తిరుపతి వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లే ఇక్కడ ఆగుతున్నాయి. ఇతర రాష్ట్రాలకు ప్రయాణించే వ్యాపారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. పొన్నూరు ప్రాంతంలో పండించే తమలపాకు, అపరాల పంటలు ఎగుమతి అవుతుంటాయి. పంట ఉత్పత్తుల కోసం వ్యాపారులు పొన్నూరు ప్రాంతానికి రావాలన్నా.. తిరిగి వెళ్లాలన్న నిడుబ్రోలు రైల్వేస్టేషన్ ప్రధాన రవాణా సాధనంగా ఉంది. బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు హాల్టు లేక.. మరోవైపు బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో ప్రయాణికులు సమీపంలోని గుంటూరు, తెనాలి, బాపట్ల వంటి ప్రాంతాలకు వెళ్లి.. అక్కడి నుంచి రైలు ప్రయాణాలు సాగిస్తున్నారు.



నిడుబ్రోలు రైల్వే స్టేషన్

ఆదాయం లేదనే నెపం..

పొన్నూరు ప్రాంతం ప్రముఖ స్వతంత్ర సమరయోధులకు, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు స్వగ్రామం. గతంలో ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల కోసం ఉద్యమాలు జరిగాయి. ఈ సమయంలో ప్రజా ప్రతినిధులు స్పందించి రైల్వే శాఖ అధికారులను హాల్టు కోసం సంప్రదించారు. అయితే ఆదాయం తక్కువగా ఉందనే నెపంతో రైళ్ల హాల్టులకు రైల్వే శాఖ మొగ్గు చూపలేదు. ప్రధానంగా సికింద్రాబాద్ నుంచి గూడూరు వెళ్లే సింహపూరి ఎక్స్‌ప్రెస్, జన శతాబ్ది, నారాయణద్రి, శేషాద్రి వంటి రైళ్లకు ఇక్కడ హాల్టు సౌకర్యం కల్పించడం వల్ల ప్రయాణికుల సంఖ్య పెరగడంతో పాటు రైల్వే శాఖ ఆదాయం పెరుగుతుందని పట్టణ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రధానంగా రైల్వే స్టేషన్‌కి వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలి. రహదారిలో వీధి దీపాలు ఏర్పాటు చేసి, మహిళా ప్రయాణికులు రాత్రి వేళ రాకపోకలు సాగించేందుకు అవసరమైన రక్షణ సౌకర్యాలు కల్పించాలి. వయోవృద్ధులు దివ్యాంగుల కోసం లిఫ్ట్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలి. వీటితో పాటు రైల్వే కోచ్ సమాచారం తెలిపే డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తులు ఉన్నాయి. అలాగే పొన్నూరు వైపు కూడా టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయడం, గతంలో ఉన్న తమలపాకులు, చేపల ఎగుమతుల కోసం ఉన్న పార్సిల్ కౌంటర్ల ఏర్పాటు వంటి సౌకర్యాలు కల్పించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి పట్టణ వాసులు విజ్ఞప్తి మేరకు నిడుబ్రోలు రైల్వేస్టేషన్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు సౌకర్యం కల్పించాలని పొన్నూరు ప్రాంత వాసులు వేడుకుంటున్నారు.

తురకపాలెం మరణాలపై వారంలో నివేదిక అందజేయాలి

● అధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశం
● 109 బ్లడ్ కల్చర్ రిపోర్టుల్లో 4 శాతం మెలియోడోసిస్ కేసులు
● రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష


సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న మంత్రి సత్యకుమార్

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో మరణాలకు దారితీసిన కారణాలపై సమగ్ర నివేదికను వారంలోగా అందజేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. తురకపాలెంలో సీనియర్ వైద్యుల పర్యవేక్షణ కొనసాగుతూనే ఉండాలని ఆయన సూచించారు. తురకపాలెంలో నమోదైన వరుస మరణాల గురించి జిల్లా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో విఫలం చెందారన్నారు. ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లే సమయంలో జ్వర పీడితులు ఎక్కువగా ఉంటే ఆ సమాచారం జిల్లా అధికారుల ద్వారా రాష్ట్ర అధికారులకు వెంటనే అందే వ్యవస్థను (సర్వైలైన్స్) శాఖాపరంగా పటిష్టం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో మరణాలకు దారితీసిన కారణాలు, స్థానికుల నుంచి సేకరించిన రక్త నమూనాలు, వాటి ఫలితాల గురించి రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్ ఇతర అధికారులు మంత్రి సత్యకుమార్‌కు వివరించారు.

మరణాల నమోదుకు యాప్‌లో ప్రత్యేక ఆప్షన్

తురకపాలెం ఘటన అనుభవంతో క్షేత్రస్థాయిలో ఉండే ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు యాప్‌లో ఏ రోజుకు ఆ రోజు గ్రామాల్లో సంభవించిన మరణాల గురించి నమోదు చేస్తారు. నిర్దిష్ట సంఖ్య కంటే మరణాల నమోదు ఎక్కువగా జరిగితే వెంటనే అలెర్ట్ మెసేజ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి, రాష్ట్ర అధికారులకు ఏకకాలంలో వచ్చేలా వ్యవస్థను పటిష్టం చేస్తున్నారు. దీనివల్ల సకాలంలో సంబంధిత ప్రాంతాల్లోని పరిస్థితులపై అప్రమత్తమై వెంటనే సత్వర చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని అధికారులు మంత్రికి వివరించారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ తురకపాలెంలో మరణాలకు దారితీసిన కారణాలపై సిఫార్సులతో ఇచ్చే నివేదికలో అక్కడ పర్యటించిన వైద్య బృందాల అభిప్రాయాలు, చేసిన సిఫార్సులు ఉండాలన్నారు.

కొత్తరెడ్డిపాలెంలోనూ అధ్యయనం చేయాలి?

తురకపాలెం మాదిరిగానే సమీపంలో ఉన్న కొత్తరెడ్డిపాలెం గ్రామస్తులకు కూడా పరీక్షలు చేయాలన్నారు. ఇక్కడి సామాజిక, ఆర్థిక పరిస్థితులు ఇంచుమించు తురకపాలెం మాదిరిగానే ఉన్నాయని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంటు డాక్టర్ రమణ యశస్వి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌వీ సుందరాచారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

59 శాతం మందిలో కొలెస్ట్రాల్ సమస్య అధికం

తురకపాలెంలో 2018 మంది 18 ఏళ్ల పైబడిన వారున్నారు. వీరిలో 1,501 మంది స్థానికంగా ఉన్నారు. మిగిలిన వేరే ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించారు. అందుబాట్లో ఉన్న 1,501 మందికి 42 రకాల పరీక్షలు నిర్వహించారు. రెండు వారాలుగా ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న వైద్య పరీక్షల ప్రాథమిక అంశాలను ఉన్నతాధికారులకు మంత్రి సత్యకుమార్‌కు అందజేశారు. ఈ వివరాలను పరిశీలిస్తే...

● గ్రామంలో 109 మంది జ్వర పీడితులను గుర్తించి వీరి నుంచి వైద్య శిబిరాల ద్వారా రక్త నమూనాలు సేకరించారు. బ్లడ్ కల్చర్ పరీక్ష ద్వారా కేవలం నాలుగు శాతం మందిలో 'మెలియోడోసిస్' ఉన్నట్లు గుర్తించారు. ఈ రోగుల్లో ఒకరు మరణించారు. మరో ముగ్గురు కోలుకున్నారు'

● గ్రామంలో సేకరించిన మట్టి నమూనాల పరీక్షల ఫలితాలు ఇంకా అందాల్సి ఉంది.

● గ్రామంలో 7 శాతం మందికి మధుమేహం ఉంది. 6 శాతం మందికి కిడ్నీకి సంబంధించిన రీనల్ ఫంక్షన్ టెస్టు (ఆర్ఎఫ్‌టీ)లో యూరియా, సీరమ్ క్రియాటినిన్ స్థాయి ఎక్కువగా ఉన్నాయి.

● 10 శాతం మందికి లివర్ ఫంక్షన్ టెస్టులో సమస్య ఉన్నట్లు తేలింది.

● లిపిడ్ ప్రొఫైల్ టెస్టులో (కొలెస్ట్రాల్) 59 శాతం మందిలో సమస్య ఉంది.

● తెల్ల రక్తకణాల పరీక్షలో 13 శాతం మందికి మోతాదుకు మించి సమస్య ఉంది.

● 14 శాతం మందిలో ఏదో ఒక ఇన్‌ఫెక్షన్ (లింఫోసైటిస్) ఉన్నట్లు నిర్ధారణ జరిగింది.

● 22 శాతం మందిలో ఎర్ర రక్తకణాల(ఆర్‌బిసి) సమస్య ఉంది.

● 48 శాతం మందిలో రక్తహీనత(ఎనీమియా) సమస్య ఉంది. వీరిలో 66 శాతం మంది మహిళలు ఉన్నారు.

ఏడు రోజుల్లో.. జ్యోతిర్లింగ సహిత దక్షిణ యాత్ర

● 23న సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలు

హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ఈ నెల 23న జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ్ యాత్ర భారత్ గౌరవ్ ప్రత్యేక టూరిస్టు రైలు బయలు దేరనుంది. వారం రోజుల్లో తిరువణ్ణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరులోని ఆలయాలను దర్శించుకునేందుకు వీలుగా తీర్థ యాత్ర ప్యాకేజీని ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) రూపొందించింది. సికింద్రాబాద్ నుంచి బయలుదేరే జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ్ యాత్ర ప్రత్యేక భారత్ గౌరవ్ టూరిస్టు రైలు విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. తీర్థయాత్రకు వెళ్లే ప్రయాణికులకు ఇతర రవాణా సౌకర్యంతో పాటు ప్యాకేజీలోనే క్యాటరింగ్ (ఉదయం టీ, అల్పాహారం, లంచ్-డిన్నర్) ఏర్పాట్లు చేసినట్టు ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. ప్యాకేజీ ధర (ఒక్కొక్కరికి) ఎకానమీ రూ.14,100, స్లీపర్ 3 ఏసీ రూ.22,500, కంఫర్ట్ 2ఏసీలో రూ.29,500గా ఖరారు చేసినట్టు వివరించారు. మరిన్ని వివరాలు, బుకింగ్ కోసం 97013 60701, 92810 30726, 92810 30740, 92814 95845 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మలుపులు..ప్రమాదానికి పిలుపులు

● కానరాని హెచ్చరిక బోర్డులు ● వాహనదారులకు తప్పని ప్రమాదాలు

పెదకూరపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. మండలంలోని బుచ్చయ్యపాలెం గ్రామం నుంచి హుస్సేన్ నగరం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో ప్రమాదకరమైన మలుపు ఉంది. పరస గ్రామం నుంచి కంభంపాడు వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డులో ప్రమాదకరమైన మూలమలుపు ఉన్నాయి. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన అంటున్నారు. ముఖ్యంగా 75 తాళ్లూరు, కాశిపాడు,పరస, అబ్బరాజుపాలెం గ్రామాల ప్రజలు.. కంభంపాడు గ్రామాల మీదగా గుంటూరు, 14 మైలు, తాడికొండ గ్రామాల వైపు నిత్యం అధిక సంఖ్యలో వాహనాలపై వెళ్తుంటారు. ఆర్టీసీ బస్సులు కూడా ఈ రూట్లో ప్రయాణిస్తూ ఉంటాయి. మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లతో కూడిన హెచ్చరిక బోర్డులు కానీ వేగ నిరోధకాలు కానీ లేవు. రహదారి వెంబడి విద్యుత్ దీపాలు కూడా లేకపోవడంతో రాత్రులు అంధకారం కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. బుచ్చయ్యపాలెం, పరస గ్రామాల మూల ములపుల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేసి.. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


బుచ్చయ్యపాలెం - హుస్సేన్ నగరం మార్గంలోని మూల మలుపు


పరస - అమరావతి మార్గంలో మూల మలుపు

6 క్రస్ట్ గేట్ల ద్వారా నాగార్జున సాగర్ నీటి విడుదల

విజయపురిసౌత్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటి మట్టం శుక్రవారం నాటికి 589.90 అడుగులు ఉంది. ఇది 311.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10 వేలు, ఎడమ కాలువ ద్వారా 6,325 , ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,414, 6 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 48,540 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 1,00,979 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 1,00,979 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.


6 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

ప్రకాశం బ్యారేజి దిగువకు 55,400 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు ప్రధాన వాగుల నుంచి 68,786 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం నమోదు అవుతుండగా దిగువకు 53,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాల్వకు 8,864, పశ్చిమ డెల్టాకు 6,522 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నారు. గుంటూరు చానల్‌కు నీటి విడుదలను నిలిపివేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 43.98 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 68,250 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మూడు గేట్లను ఎత్తి 72,236 క్యూసెక్కుల నీరు, మొత్తం 89,236 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

1.0658 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జు సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 7 గేట్లను 2 మీటర్లు, ఒక గేట్ మీటర్ మేర ఎత్తి 73, 842 క్యూసెక్కులు, టేల్‌రేస్ చానల్ ద్వారా 8,476 మొత్తంగా 82,318 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. గురువారం అర్ధరాత్రి వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0658 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి జరిగిందన్నారు. రిజర్వాయర్‌లో 75.50(పూర్తిస్థాయి) మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080(పూర్తి స్థాయి) టీఎంసీలకు సమానమన్నారు.సాగర్ నుంచి 82 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.

16న కోడెల విగ్రహావిష్కరణ

వినుకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌పీ కాలనీ సమీపంలోని నరసరావుపేట రోడ్డులోని జాతీయ ప్రధానరహదారిపై ఈ నెల 16వ తేదీన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ తొలి సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాద్ విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రస్తుత శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయులు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి, ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ అహ్మద్ షరీఫ్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెల శివరాంతో పాటు రాష్ట్ర, జిల్లా టీడీపీ నాయకులు పాల్గొనున్నట్లు తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి టీడీపీలోని వివిధ విభాగాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

మండలంలో 4 వేల ఎకరాల పంట వివరాలు నమోదు

చిలకలూరిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 6,500 ఎకరాల్లో పొగాకుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, కంది పంటలు వేశారని, 4 వేల ఎక రాలకు సంబంధించిన పంట వివరాల నమోదు కూడా పూర్తయిందని మండల వ్యవసాయ అధికారి సీహెచ్ సరిత శుక్రవారం తెలిపారు. ఈ నెలాఖరు లోగా మరో రెండు.. మూడు వందల ఎకరాలు సాగులోకి వస్తుందని అంచనాగా ఉందని అన్నారు. మండలంలోని దండమూడి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి ఎరువుల వాడకంపై అవ గాహన కల్పించారు. యూరియా కొరత లేదని స్పష్టం చేశారు. కార్యక్ర మంలో ఏఈవో ఎస్ ప్రవీణ్, నాగరాజు పాల్గొన్నారు.

ఔషధాల కంపెనీ ప్రతినిధులకు జైలు జరిమానా

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఔషధాలపై అధిక ధరను ముద్రించి విక్రయించినట్లు నేరం అంగీకరించడంతో కంపెనీ ప్రతినిధులు రాజేష్ భాటియా, నవీన్ భాటియాలకు ఒకరోజు జైలు శిక్ష, ఒక్కొక్కరికి 10వేల జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఏ.సలోమీ తీర్పు వెలువరించారు. 2017వ సంవత్సరంలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రీమన్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు కోపీ ర్గిన్ 750 ఎంజి మందులను ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే అధిక ధరను ముద్రించి విక్రయించారు. అంశాన్ని అప్పటి నరసరావుపేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పారా శ్రీరామ్మూర్తి తనిఖీ చేసి కనుగొన్నారు. ఆయన కేసు నమోదు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. ప్రస్తుత డ్రగ్ ఇన్ స్పెక్టర్ డి.సునీత నిందితులను కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితులు నేరం అంగీకరించడంతో జైలు శిక్ష, జరిమానా విధించారు.

క్లుప్తంగా...

● చిలకలూరిపేట : ఆటోవాలాకు దసరాకు రూ.15 వేల చొప్పున అందిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో ఆటోవాలాలు సంబరపడుతున్నారని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పి.బాలాజి శుక్రవారం చెప్పారు. స్త్రీశక్తి ఉచిత బస్సు పథకం అమలుతో ఆదాయం కోల్పోతున్న ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర కింద సాయం చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడం హర్షణీయమన్నారు.

● చిలకలూరిపేట: ఆవాజ్, అభ్యుదయ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని కళామందిర్ సెంటర్ మసీదు ఎదుట శుక్రవారం మానవహారంగా ఏర్పడి సేవ్ గాజా పేరుతో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచశాంతి వర్ధిల్లాలి, సామ్రాజ్యవాదం నశించాలి అంటూ ముస్లింలు నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన జరిపారు. భారతదేశం పాలస్తీనాకు అండగా నిలవాలన్నారు.

● చిలకలూరిపేట: రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన మల్లెం అంజమ్మను స్థానిక ఎన్ఆర్టీ సెంటర్లోని బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. కోట పవన్‌కుమార్ గాంధీ, సింగిరేసి పోలయ్య, మల్లెల శివ నాగేశ్వరరావు, గట్టా హేమకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

● చిలకలూరిపేట: రాష్ట్ర బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన బిళీను నాయక్‌ను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో మద్దుల వెంకట కోటయ్య, పీఎల్‌పీ యాదవ్, కొండ్రముట్ల నాగేశ్వరావు. గుంజి బాల సుబ్రహ్మణ్యం, బత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పదేళ్లుగా ఇక్కడ చేస్తున్న ఉచిత మార్షల్ ఆర్ట్స్ సేవలకు గుర్తింపుగా చిలకలూరిపేట న్యూ షావోలీన్ కుంగ్‌ఫూ అకాడమికి చెందిన ఐదుగురు మాస్టర్స్ ఉన్నత స్థాయి బోధిధర్మ ఉత్తమ మాస్టర్ అవార్డు పొందిన సందర్భంగా స్థానిక గార్డ్స్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో దార్ల బుచ్చిబాబు, షేక్ కరీముల్లా, దాసరి చిట్టిబాబు, అన్నలదాసు బుల్లిబాబు, జి.వీరాంజనేయులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: స్థానిక రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో చిలకలూరిపేట మండలం పోతవరం కస్తూర్బాగాంధీ పాఠశాలలో దంత వైద్యశిబిరం నిర్వహించారు. దంత వైద్యుడు డాక్టర్ పేర్ని కృష్ణమోహన్ దంతాలను శుభ్రపరచుకునే, సంరక్షించుకునే విధానం గురించి వివరించి దంత వైద్యపరీక్షలు చేశారు. శిబిరంలో క్లబ్ అధ్యక్షుడు బోనం వెంకటేశ్వరరావు, క్లబ్ సభ్యులు కొల్లా సుబ్బారావు, చెంచు పున్నయ్య, రాఘవయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

● నాదెండ్ల : మండలంలోని మైనంపాడు గ్రామ పరిధిలో గల నైస్ పాఠశాల విద్యార్థులకు నరసరావుపేటకు చెందిన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చేయూత నిచ్చింది. నరసరావుపేటకు చెందిన కోయా రామారావు మనుమరాలు తన్వి సాయి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం అన్నదానం చేశారు.

గుంతలతో రైల్వేస్టేషన్ రోడ్డు

● మరమ్మతులపై దృష్టి సారించని పాలకులు, అధికారులు

● ఇబ్బందులు ఎదుర్కొంటున్న ద్విచక్ర వాహనదారులు



మట్టి రోడ్డును తలపిస్తున్న వినుకొండ రైల్వేస్టేషన్ రహదారి



రోడ్డుపై ఏర్పడిన గోతులు

వినుకొండటౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వినుకొండ రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పదవ వార్డు వైపు చప్టా పగిలిపోవడంతో బయట పడ్డ ఇనుప చువ్వలు

30 ఏళ్ల క్రితం నరసరావుపేటరోడ్డులోని స్థూపం సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు సిమెంటు రోడ్డు నిర్మించారు. కాలం గడిచే కొద్ది వర్షాల తాకిడికి సీసీ రోడ్డు పైలేయర్‌తో పాటు ప్రతి పది అడుగులకు రోడ్ల మధ్య గుంతలు ఏర్పడటంతో ద్విచక్రవాహనదారులు, ఆటో యజ మా నులు రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఒకే రోడ్డు పట్టణంలోని 4వ వార్డు, పదో వార్డుల సరిహద్దు ప్రాంతం కావడంతో కనీసం మున్సిపల్ సిబ్బంది రోడ్డును ఊడ్చిన దాఖలాలు లేవు. పదేళ్లుగా 4వ వార్డు సమీపంలోని డ్రెయినేజీ పూర్తిగా పూడిపోవడంతో ఆ ప్రాంతంలో ఇళ్ల నుంచి నీరు బయటకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇటీవల అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వేస్టేషన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో ఈ ప్రాంతంలోని వర్షపునీరంతా రైల్వేస్టేషన్ రోడ్డుకు చేరి నిల్వ ఉండటం తో రాత్రివేళల్లో ప్రయాణికులు స్టేషన్‌కు చేరుకోలేని పరిస్థితి నెలకొని ఉంది. ఇప్పటికైనా నేటి పాలకులు, మున్సిపల్ అధికారులు నిత్యం రద్దీగా ఉండే రైల్వేస్టేషన్ రోడ్డు అభివృద్ధిపై దృష్టిసారించి ప్రయాణికుల రాకపోకలకు వీలు కల్పించాలంటూ స్థానికులు కోరుతున్నారు.

యూరియా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు : ఏడీఏ



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యూరియా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు ఎరువుల దుకాణాల యజమానులకు సూచించారు. నరసరావుపేటలోని హోల్సేల్ డీలర్స్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. హోల్‌సేల్ డీలర్స్ అందరూ వచ్చిన యూరియాను రిటైల్ డీలర్లకు అధిక ధరలకు అమ్మకూడదని హెచ్చరించారు. అదే విధంగా ఇతర జిల్లాలకు పంపించకుండా మన జిల్లా పరిధిలోని రిటైల్ డీలర్స్‌కు సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఐ శాంతి, వ్యవసాయ విస్తరణ అధికారి కే బ్రహ్మయ్య హోల్సేల్ డీలర్స్ పాల్గొన్నారు.

అవసరం మేరకే ఎరువులను కొనుగోలు చేయాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో వరలక్ష్మి

వినుకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటీగలపాలెం రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ కార్యక్రమం నిర్వహిం చారు. ఏవో వరలక్ష్మి రైతులనుద్దేశించి మాట్లాడుతూ రైతులు పంటకు ఒకసారి వేయవలసిన ఎరువులు మాత్రమే కొనుగోలు చేయాలని, యూరియా నిల్వలు ఉన్నాయని ఎవరు ఆందోళన చెందవద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ఆరిఫ్, యశ్వంత్, పురుషోత్తం రెడ్డి, రైతులు పాల్గొన్నారు

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ బాలనాగమ్మ, తహసీల్దార్ నిర్మల, ఎంపీడీవో మాథ్యూబాబు

రొంపిచర్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమా వేశ మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ గడ్డం బాల నాగమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహసీల్దార్ నిర్మల, ఎంపీడీవో మాథ్యూబాబు, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. గ్రామంలో యూరియా సరఫరా చేపట్టాలని కోరారు. విద్యుత్, ఆర్అండ్‌బీ, గృహ నిర్మాణ, ఆర్టీసీ శాఖల అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ప్రతి సర్వసభ్య సమావేశానికి కోరం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఉన్న ఎంపీటీసీలు అందరూ వైసీపీకి చెందిన వారు కావటంతో సమావేశానికి హాజరు నామమాత్రంగానే అవుతున్నా రు. సభ్యుల కోసం ఎదురు చూడటానికే సమయం సరిపోతుంది.

మోడల్ పాఠశాలలో విద్యార్థులకు పోటీలు

రొంపిచర్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపాలెంలో పీఎం శ్రీ ఏపీ మోడల్ పాఠశాలలో వారధి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీలు శుక్రవారం జరిగాయి. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఎంఈవో బ్రహ్మేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రవి నాయక్ పర్యవేక్షించారు. గెలుపొందిన వారు జిల్లా స్థాయి, అనంతరం రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు.

మండల తెలుగు రైతు విభాగం కార్యవర్గం ఎన్నిక

● అధ్యక్ష కార్యదర్శులుగా కనపర్తి, పిన్నింటి



లక్ష్మీప్రసాదు



రవీంద్రబాబు

యడ్లపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా తెలుగురైతు మండల విభాగం కార్యవర్గ ఎంపిక శుక్రవారం జరిగింది. పార్టీ కార్యాలయంలో మండల సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన నాయకులు లింగారావుపాలేనికి చెందిన కనపర్తి లక్ష్మీప్రసాద్‌ను తెలుగురైతు మండల విభాగం అధ్యక్షుడిగా, జాలాది గ్రామానికి చెందిన పిన్నింటి రవీంద్రబాబును ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమ ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు, టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, ఏఎంసీ చైర్మన్ షేక్ కరీము ల్లా, మండల అధ్యక్షుడు సాయిబాబు, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుల అన్నదానానికి విరాళం

ఈపూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో వృద్ధులకు ఉచితంగా భోజనం పెడుతున్న వారికి టాస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ, సూరే సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచేటి సుప్రియ, వేణుమాధవ్, గ్రీష్మాలు శుక్రవారం రూ.50 వేల విరాళం అందజేశారు. ఆదరణ కోల్పోయి తిండికి అవస్థలు పడుతున్న వృద్ధులకు గ్రామంలోని శీలం పద్మ, సూరే అప్పారావు, ఊట్ల రామారావు, షేక్ ఆదాంలు రెండు పూటల భోజనం ఉచితంగా పెడుతున్నారు. గ్రామంలోని 35 మంది వృద్ధులకు రెండు పూటలా సరిపడ భోజనంను క్యారేజీల ద్వారా అందజేస్తున్నారు. గ్రామానికి చెందిన కంచేటి చంద్రరావు తనవంతుగా వృద్ధులకు భోజనం పెట్టినన్ని రోజులు బియ్యం ఉచితం గా అందజేస్తానన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం

వినుకొండటౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని యువకుడి మృతదేహా న్ని పట్టణంలోని కస్తూర్బా పాఠశాల సమీపంలో గల పెరుమాళ్లపల్లి కాలువలో శుక్రవా రం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే.. సుమారు 25 నుంచి 30 సం వత్సరాల మధ్య వయసు గల యువకుడు నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉండ వచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతడి శరీరంపై స్కైబ్లూ రంగు షర్ట్, లైట్ కాఫీ రంగు ప్యాంట్, కుడిచేతికి ఎరుపు రంగు తాడు గల రాఖీ, హుడ్‌ల్యాండ్ కంపెనీ బెల్టు ధరించి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. వీఆర్వో సుధీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కత్తి స్వర్ణలత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు పోలీసులు తెలిపారు.

కళోత్సవం పోటీల్లో వేల్పూరు విద్యార్థుల ప్రతిభ

శావల్యాపురం(వేల్పూరు), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బోయపాలెంలోని డైట్ కళాశాల్లో ఉమ్మడి గుంటూరుజిల్లా స్థాయిలో శుక్రవారం నిర్వహించిన కళోత్సవంలో వేల్పూరు జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల గైడ్ టీచర్ జ్యోతి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ లఘునాటికలో పాఠశాలకు చెందిన సాయికృష్ణ టీం ప్రథమ బహుమతి సాధించగా, స్టోరీ టెల్లింగ్‌లో ఉగ్గుకథను చెప్పి శ్రీహేమలత టీం ప్రథ మ బహుమతి సాధించినట్లు తెలిపారు. జానపద నృత్యంలో 17టీంలు పోటీకి రాగా వేల్పూరు జడ్పీపాఠశాలకు చెందిన అక్షయ టీం విద్యార్థులు తీర్థలక్ష్మి, అక్షయ, దివ్య, సంజయ్, అశోక్, యశస్విని, ప్రసన్నలు ద్వితీయస్థానంలో నిలిచినట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులంతా అక్టోబరు నెలలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున పాల్గొంటారన్నారు. విజేతలకు డీవైఈవో మహమ్మద్ సుభానీ బహుమతులు అందజేసి అభినందించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

నూజెండ్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం శ్రీవెంకటేశ్వర స్వామి కమిటీ హైస్కూల్ క్రాఫ్ట్ మాస్టారు వీఎస్ఆర్‌కే ప్రసాదు జిల్లా ఉత్తమ ఉపాధ్యా యుడిగా అవార్డు తీసుకున్న సందర్భంగా శుక్రవారం పాఠశాల హెచ్ఎం కామేశ్వరరావు శర్మ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. పాఠశాల స్థాపించినప్పటికీ గత 55 సంవ త్సరాల్లో మొదటిసారిగా పాఠశాల ఉపాధ్యాయుడికి అవార్డు రావటం ఆనందకరమని హెచ్ఎం కామేశ్వరరావు శర్మ పేర్కొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడం అదృష్టం : ఎంపీడీవో

బొల్లాపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయటం ఒక అదృష్టమని ఎంపీడీవో పీ మాధురి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్ర వారం 'అందరికీ విద్య... అందరి బాధ్యత' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ వలంటీర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. తాను కూడా ఓ పది మందికి చదువు నేర్పిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య పర్యవేక్షకుడు కే వెంకటేశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణాల వద్ద డెకాయ్ ఆపరేషన్

బొల్లాపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పరమేశ్వర వైన్స్, గణేష్ వైన్స్, వెంకటేశ్వర వైన్స్ మద్యం దుకాణాలను శుక్రవారం ఎక్సైజ్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మద్యం దుకాణాల వద్ద డెకాయ్ ఆపరేషన్‌లు నిర్వహించి మద్యం అమ్మకం ధరలను నిర్ధారించుకున్నారు. అలాగే మద్యం కొనుగోలుదారులతో మాట్లాడి మద్యం ఎంఆర్‌పీకే విక్రయాలు జరుగుతున్నట్లు నిర్ధారించుకున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డీ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ నాయకుడిగా ఎదిగిన గొప్పనాయకుడు ఏచూరి

వినుకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు సీతారామ్ ఏచూరి మృతి పార్టీ తీరని లోటు అని పార్టీ వినుకొండ కమిటీ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు అన్నారు. సీతారామ్ ఏచూరి ప్రథమ వర్ధంతి సభ స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం జరిగింది. కార్యక్రమంలో కే.హనుమంతరెడ్డి, రంజాన్‌బీ, ఎం.తిరుమల లక్ష్మి, పి.వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కోర్టు ఇన్‌చార్జ్ ఏజీపీగా సీతారామాంజనేయులు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రధాన సీనియర్ సివిల్ న్యాయాధికారి, అదనపు సీనియర్ సివిల్ న్యాయాధి కారి ,ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టుల ఇన్‌చార్జ్ ఏజీపీ గా స్థానిక 13వ అదనపు జిల్లా కోర్టు ఏజీపీ కె.సీతారామాంజనేయులు ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జి.జయప్రకాష్ పదవీ కా లం పూర్తవడంతో ఆయన స్థానంలో సీతారామయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నాదెండ్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలంటూ మండ లంలోని సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవో స్వరూపరాణికి శుక్రవారం వినతిపత్రం అంద జేశారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృ శాఖకు అప్పగించటం, సీనియార్టీ ఆధారంగా పారదర్శకంగా బదిలీ చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చే విధంగా చర్య లు తీసుకోవాలన్నారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి : ఇన్‌చార్జి ఏవో



వీఏఏలకు సూచనలిస్తున్న ఇన్‌చార్జి ఏవో రామారావు

శావల్యాపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతు లు సాగుచేసిన ప్రతి పంటను వీఏఏలు బాధ్యత తీసుకొని ఈ-క్రాప్ లో నమోదు చేయాలని ఇన్‌చార్జి ఏవో రామినేని రామారావు అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో వీఏఏలతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఏవో మాట్లాడుతూ ఖరీఫ్2025 ఈక్రాప్ నమోదు ఈ నెలాఖరుతో ముగుస్తుందని, కాబట్టి రైతులంతా వీఏఏలను సంప్రదించి నమోదు చేయించుకోవాలన్నారు.

రాముడుపాలెంలో జ్వరాలపై సర్వే

నూజెండ్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాముడుపాలెం గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది జ్వరాలపై సర్వే నిర్వహించారు. మురుగునీరు నిల్వ ఉండ కుండా తీసుకోవాల్సిన పారిశుధ్య చర్యలను గ్రామస్థులకు ఆరోగ్య సిబ్బంది తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో తిరుపతమ్మ, ఏఎన్ఎం అంజమ్మ, హేమలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రొంపిచర్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా రొంపిచర్ల, బుచ్చిపాపన్నపాలెం, రెడ్డిపాలెం, సబ్ స్టేషన్‌ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. మూడో ఫేజ్ కరెంటు శనివారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి 9 గంటల వరకు ఇస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

వడ్డెంగుంటలో పశువైద్యశిబిరం

బొల్లాపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్డెంగుంట గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో పశు వైద్యులు డాక్టర్ సుధా కర్, డాక్టర్ గోపాల్ నాయక్, డాక్టర్ సునీత, డాక్టర్ జీ కవితలు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పశు పోషకులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో గోపాల మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కోసం మొబైల్ వాహనం

● ప్రారంభించిన డీఎంహెచ్‌వో



వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో హెచ్ఐవీపై అవగాహన కోసం ప్రత్యేక మొబైల్ వాహనాన్ని డీఎం హెచ్‌వో డాక్టర్ రవి శుక్రవారం ప్రారంభించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వాహనం ద్వారా విద్యార్థులు, ప్రజలకు హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా ఎయిడ్స్ ప్రోగ్రామ్ మేనేజర్ జానీ బాషా, కిరణ్‌కుమార్, రవి, జ్యోతి, ఎన్జీవోలు లింక్ వర్కర్ స్కీం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు నరసరావుపేటకి చెందిన అహల్య హాస్పిటల్ వైద్యులు శనక్కాయల రాజకుమారి, ఉమాశంకర్ బ్రెస్ట్‌కాన్సర్, రుతుక్రమంపై శుక్రవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల పలు సందేహాలకు డాక్టర్ రాజకుమారి సూచనలు చేశారు. విద్యార్థునులు ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ వైవీ నారాయణ, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కలిగిస్తున్న వైద్యులు

ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాప్



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు నజీర్‌బీ షేక్, కే.రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్లట్టర్ ప్రోగ్రా మింగ్ టెక్నాలజీ వర్క్‌షాప్ శుక్రవారం నిర్వహించారు. విజయవాడ డేటా వ్యాలీ కంపెనీ ప్రతినిధులు నజీర్‌బీ షేక్, ఎస్ రాజేంద్రప్రసాద్ లు కంప్యూటర్స్ సైన్స్ విద్యార్థులకు కోడింగ్ టెక్నిక్స్ నేర్పించారు. వా రం రోజుల పాటు ప్రాజెక్టులు చేయించి, విద్యార్థులకు సర్టిఫికెట్లు అం దించారని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య అన్నారు. కళాశాల చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు, ప్రిన్సిపాల్ సాధినేని రామారావు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ విభాగాధిపతి రాధిక, ఎంసీఏ విభాగాధిపతి నవీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాలొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో తొమ్మిది మంది ఎంపిక

నాదెండ్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గణపవరం సీఆర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో తొమ్మిది మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఫ్లెక్స్ టెక్ కంపెనీ వారు నిర్వహించిన ఈ ఇంటర్వ్యూకు సీఆర్ కళాశాల, నిఖిల డిగ్రీ కళాశాల కు చెందిన డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు 60 మంది హాజరయ్యారు. కాగా ఎంపికైన తొమ్మిది మంది విద్యార్థులకు కంపెనీ మేనేజర్ పీ చంద్రశేఖర్, హెచ్ఆర్ గోపీనాథ్‌లు లేఖలు అందజేశారు. వీరిని ప్రిన్సిపాల్ మనోహర్, కరస్పాండెంట్ వేణుగోపాల్, డైరెక్టర్ చుండి రంగనాయకులు, ఇంటర్ ఇన్‌చార్జ్ నిరంజన్ తదితరులు అభినందించారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి : ఏపీటీఎఫ్



తహసీల్దార్ వేణుగోపాలరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ డిమాండ్ చేసింది. శుక్రవారం మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలో భాగంగా నరసరావుపేట తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన ప్రదర్శన చేసి తహసీల్దార్ కే.వేణుగోపాలరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ 57 జీవోను తక్షణం అమలుచేయాలని, 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియ మించి, ఐఆర్ ప్రకటించాలన్నారు. అన్ని రకాల బకాయిలను చెల్లించాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డీ కరీముల్లా, పల్నాడు జిల్లా కార్యదర్శి బిక్కి ప్రజామూర్తి, ఎస్‌కే జిలానీ, ఎస్‌కే జానసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కరాటే పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో శుక్రవారం కరాటేలో అండర్-14, 17 బాలబాలికలను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బాలుర విభాగంలో ఎస్.భరత్, ఎస్.ఈశ్వరకుమార్, పి.ధనువర్షిత్, వి.ఆనంద్‌సాయి, సీహెచ్ అజయ్, ఎస్.కృష్ణ, ఆర్.అభిషేక్, పి.వరుణ్ సాయి, కె.కార్తీ వర్మలు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో శశిరేఖ, కె.గాయత్రి, సిహెచ్.జ్ఞానలక్ష్మీ, జె.మణిదీపిక, పి.చక్రిత, షేక్.తస్లీమా, కె.వసుధ, వై.వేదవర్షిణి, షేక్.ఫర్హానా, షేక్.నాగుర్ నజ్మా, ఆర్.జెస్సికా లక్ష్మీ ఎంపికయ్యారు. ఎంపికలు పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలను స్టేడియం ఇన్‌ఛార్జ్ నరసింహారెడ్డి, కార్యదర్శులు ఎన్.సురేష్‌కుమార్, ఉన్నం పద్మావతిలు ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు ఎస్.సుబ్రమణ్యం, షేక్.రషీదా పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహకులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం



మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం(కనమర్లపూడి), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభు త్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తుందని ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. కనమర్లపూడి ప్రాథమిక పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు పాఠశాలల్లో రెబల్‌స్టార్స్‌ను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని హెచ్ఎం లిల్లీరాణికి సూచించారు.